Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

# రాజధాని వార్తలు

# RAJADHANI VARTALU

ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్ధతి కానే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు

rajadhanivartalu@gmail.com
94406 62699

అమరావతి సంపుటి (Vol) : 7 సంచిక (Issue) : 149 పేజీలు (Pages) : 8 వెల : రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)

బుధవారం, 14 - 1 - 2026

94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com NI No.: APTEL/2019/77985 Postal regd: GTR/114/2025-27 స్థాపితం : 2015

## 18 యేళ్ల తర్వాత.. మళ్లీ డబుల్ డెక్కర్ బస్సులు

### - పచ్చజెండా ఊపి ప్రారంభించిన సీఎం స్టాలిన్



**చెన్నై :** నగరంలో మళ్ళీ డబుల్ డెక్కర్ బస్‌సేవలు ప్రారంభమయ్యాయి. అమెరికాలో నివసిస్తున్న ప్రవాస తమిళులు, ప్రముఖులు సమకూర్చిన నిధులతో తొలి విడతగా ఏసీతో కూడిన విద్యుత్‌తో నడిచే ఎరుపు రంగు డబుల్ డెక్కర్ బస్‌ను సోమవారం ఉదయం నందంబాక్కం ట్రేడ్ సెంటర్ వద్ద ముఖ్యమంత్రి స్టాలిన్ పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. నగరంలోని మహానగర రవాణా సంస్థ (ఎంటీసీ) గతంలో పల్లవన్ రవాణా సంస్థ (పీటీసీ)గా ఉన్నప్పుడు 1970లో బ్రాడ్వే నుంచి తాంబరం వరకు డబుల్ డెక్కర్ బస్సులు నడుపుతుండేవారు. ఆ బస్సులో కండెక్టర్ సీటు పక్కనే పై అంతస్థుకు వెళ్లేందుకు గుండ్రంగా ఇనుప మెట్లుండేవి. 2007లో ఆ డబుల్ డెక్కర్ బస్ సేవలను నిలిపివేశారు. 2021లో డీఎంకే ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నగరంలో మళ్ళీ డబుల్ డెక్కర్ బస్సులు నడపాలని నిర్ణయించింది. అశోక్ లైలాండ్ సంస్థ నుండి 20 డబుల్ డెక్కర్ బస్సులను కొనుగోలు చేసేందుకు ఒప్పందం కుదుర్చుకుంది. అదే సమయంలో దేశ విదేశాల నుండి వచ్చే పర్యాటకులు రాజధాని నగరం అందాలను ఆస్వాదించడానికి అనువుగా కీలకమైన ప్రాంతాలకు ఈ బస్సులను నడపాలని రాష్ట్ర పర్యాటక శాఖ నిర్ణయించింది. ఆ ప్రకారం తొలివిడతగా అమెరికాలోని ప్రవాస తమిళ ప్రముఖులు సమకూర్చిన నిధులు రూ.1.89 కోట్లతో ఏసీ సదుపాయంతో కూడిన ఎరుపు రంగు డబుల్ డెక్కర్ ఈవీ బస్సును అశోక్ లైలాండ్ సంస్థ నుండి రాష్ట్ర పర్యాటక శాఖ కొనుగోలు చేసింది. ఈ బస్సుకు ఇరువైపులా తంజావూరు బృహదీశ్వరాలయం, లైట్‌హౌస్, రిప్పన్‌భవనం, జల్లికట్టు చిత్రాలున్నాయి. 'తమిళ్ వాళ్గ' (తమిళం వర్ధిల్లాలి) అనే అక్షరాలు అందంగా ముద్రించారు.. ఈ డబుల్ డెకర్ ఈవీ బస్సును ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రారంభించి ఆ బస్సులో ఉన్న సదుపాయాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు రాజేంద్రన్, ఎస్ఎం నాజర్, టీఆర్బీ రాజా, ప్రభుత్వ ప్రధాన కార్య దర్శి ఎన్.మురుగానందం, పర్యాటక శాఖ అదనపు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కే మణివాసన్, ప్రభుత్వ రంగ కార్యదర్శి రీటా హరీష్ టక్కర్, పర్యాటక సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ డి.క్రీస్తురాజా, అశోక్‌లేలాండ్ సంస్థ సీఈఓ సోను అగర్వాల్, ఎన్వీ గ్రూపు సీఈఓ వీర వేణుగోపాల్, స్విచ్ మొబిలిటీ సంస్థ సీఈఓ ఎస్ గణేష్ మణి తదితరులు పాల్గొన్నారు.

**ప్రయాణ మార్గం...**

ఈ డబుల్ డెక్కర్ ఈవీ బస్సును రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ (టీటీడీసీ) ప్రధాన కార్యాలయం, ఎల్ఐసీ, స్పెన్సర్ ప్లాజా, పల్లవన్ రోడ్డు, రాజా అన్నామలై మండ్రం, సెక్రటేరియట్, రిజర్వు బ్యాంక్, హార్బర్, నేపియర్ బ్రిడ్జి, అన్నా సమాధి ప్రాంతం, లైట్ హైస్, పట్టినంబాక్కం బీచ్, శాంథోమ్ చర్చి, డీజీపీ కార్యాలయం, క్వీన్ మేరీస్ కళాశాల, వివేకానందర్ ఇల్లమ్, రాజధాని కళాశాల, మద్రాసు వర్సిటీ, దూరదర్శన్ కేంద్రం, రాజా మండపం, ఓమందూరార్ ఆస్పత్రి వీక్షించేలా టీటీడీసీ ప్రధాన కార్యాలయం వరకు నడుప నున్నారు.

## నారావారిపల్లిలో అభివృద్ధి పండుగ.. సీఎం చేతుల మీదుగా శంకుస్థాపనలు



**తిరుపతి, (రాజధాని వార్తలు):** సంక్రాంతి పండుగ సందర్భంగా స్వగ్రామం నారావారిపల్లిలో సీఎం చంద్రబాబు నాయుడు పలు ముఖ్యమైన ప్రాజెక్టులను ప్రారంభించడంతో పాటు శంకుస్థాపనలు చేశారు. ముఖ్యంగా రంగంపేట – భీమవరం నుంచి లింగేశ్వరాలయానికి వెళ్లే తారురోడ్డును సీఎం ప్రారంభించారు. అలాగే చంద్రగిరి మండల ప్రజలకు సాగునీరు.. తిరుమల, తిరుపతికి తాగునీరు అందించేందుకు నీవా బ్రాంచ్ కెనాల్ నుంచి కల్యాణ్ డ్యామ్‌కు కృష్ణా జలాలను తీసుకురావడానికి రూ.126 కోట్లతో మూలపల్లి చెరువు వద్ద శంకుస్థాపన చేశారు. స్వర్ణ నారావారిపల్లి అభివృద్ధిలో భాగంగా అధునాతన సాంకేతికతను ఉపయోగించి 4.2 కోట్ల రూపాయలతో నిర్మించిన 33/11 కేవీ సబ్ స్టేషన్‌ను సీఎం ప్రారంభించారు. అలాగే ప్రకృతి వ్యవసాయ మోడల్ ప్లాంటేషన్, డ్రోన్‌ను ఉపయోగించి మందులు పిచికారీ చేయటాన్ని ప్రారంభించారు. స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ నూతన భవనానికి ముఖ్యమంత్రి ప్రారంభో త్సవం చేశారు. ఎస్వీ యూనివర్సిటీ, మహిళా యూనివర్సిటీ, రుయా ఆసుపత్రులకు సంబంధించిన పలు అభివృద్ధి కార్యక్రమాలను సీఎం చంద్రబాబు ప్రారంభించారు.

**సంక్రాంతి సంబరాల్లో సీఎం..**

కాగా.. సంక్రాంతి సంబరాల్లో పాల్గొనేందుకు సీఎం చంద్రబాబు కుటుంబ సభ్యులతో కలిసి స్వగ్రామం నారావారిపల్లికి విచ్చేశారు. చంద్రబాబుతో పాటు ఆయన సతీమణి నారా భువనేశ్వరి, కుమారుడు మంత్రి నారా లోకేశ్, కోడలు నారా బ్రాహ్మణి తదితర కుటుంబ సభ్యులు గ్రామస్థులతో కలిసి సంబరాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన వినోదాత్మక క్రీడలు, ముగ్గుల పోటీలు, రంగవల్లులు అందరినీ ఆకట్టుకున్నాయి.

**సీఎం మనవడి ఆట..**

ముగ్గుల పోటీలతో పాటు క్రీడా పోటీలను చంద్రబాబు దంపతులు ఆసక్తిగా తిలకించారు. పోటీలలో గెలుపొందిన చిన్నారులకు ఈ దంపతులు బహుమతులు అందజేశారు. నారావారిపల్లికి చుట్టు పక్కల ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే పిల్లలు క్రీడల్లో పాల్గొన్నారు. ఒక్కో స్కూల్ పిల్లలతో వేరు వేరుగా గ్రూప్ ఫొటో తీసుకున్నారు చంద్రబాబు దంపతులు. అందరితో పాటు నారా, నందమూరి కుటుంబాలకు చెందిన పిల్లలు గ్రామీణ క్రీడల్లో పాల్గొన్నారు. వీరిలో గెలుపొందిన వారికి అందరితో పాటు బహుమతుల ప్రదానం చేశారు. చంద్రబాబు ఇంటి ముందర ఉన్న గ్రౌండ్లో పోటీలు నిర్వహించి.. బహుమతులు అందజేశారు. ముఖ్యంగా సీఎం మనవడు నారా దేవాన్ష్ తన స్నేహితులతో కలిసి వివిధ గ్రామీణ క్రీడల్లో ఉత్సాహంగా పాల్గొని అందరినీ మురిపించాడు.

**ప్రజలతో మమేకమై..**

పరదాల సంస్కృతికి భిన్నంగా సొంత ఊరు నారావారిపల్లిలో ముఖ్యమంత్రి ప్రజలతో మమేకమయ్యారు. క్రీడా పోటీల్లో పాల్గొన్న వారికి బహుమతులు ఇచ్చిన అనంతరం.. ఇంటికి వెళ్లే క్రమంలో దారి పొడవునా అర్జీలు స్వీకరించారు. తమ నుంచి ముఖ్యమంత్రి స్వయంగా అర్జీలు స్వీకరించడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రికి అర్జీలు ఇవ్వడం కోసం పొరుగు జిల్లాల నుంచి ప్రజలు తరలి వచ్చారు. అర్జీలు స్వీకరించడమే కాకుండా పరిష్కారం కోసం అక్కడికక్కడే సంబంధిత అధికారులకు ఆదేశాలిచ్చారు సీఎం. ఈ కార్యక్రమాలతో నారావారిపల్లెలో సంక్రాంతి సంబరాలు మరింత ఉత్సాహంగా మారాయి.

## దారుణం.. రైలు పట్టాలపై గర్భిణీ ప్రసవం



**పార్వతీపురం, (రాజధాని వార్తలు):** రైలు పట్టాలపై ఓ నిండు గర్భిణి ప్రసవించిన సంఘటన పార్వతీపురం మన్యం జిల్లాలో చోటు చేసుకుంది. ఒడిశాలోని బరంపూర్‌కు చెందిన ప్రియ పాత్ర.. నిండు గర్భిణీ. కొద్ది రోజుల్లో ఆమెకు నెలలు నిండనున్నాయి. మంగళవారం ఉదయం అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్‌లో కుటుంబ సభ్యులతో కలిసి ఆమె సూరత్‌కు బయలుదేరింది. ఈ క్రమంలో రైలులో పురిటి నొప్పులు ప్రారంభమయ్యాయి. దీంతో సహచర ప్రయాణికులు వెంటనే అప్రమత్తమయ్యారు. ఈ విషయాన్ని టీసీ ద్వారా గార్డుకు తెలియజేశారు. పార్వతీపురం సమీపంలోకి రైలు వచ్చే సరికి.. ఆమె పరిస్థితి ఆందోళనకరంగా మారింది. దీంతో సమీపంలోని బెలగాం స్టేషన్ వద్ద రైలును అత్యవసరంగా నిలిపివేశారు. అనంతరం కుటుంబ సభ్యులు, మహిళా ప్రయాణికుల సహాయంతో రైలు నుంచి ప్రియా పాత్రను కిందకు దింపారు. ఆ తర్వాత.. రైలు పట్టాల పైనుంచి ఆమెను దాటిస్తుండగా.. ఆమెకు నొప్పులు అధికమయ్యాయి. ఇంతలో పట్టాలపైనే ఆమె ప్రసవమయింది. అనంతరం.. తల్లీబిడ్డను ఆమె కుటుంబ సభ్యులతో కలిసి స్థానికులు సమీ పంలోని ఆసుపత్రికి తరలించారు. తల్లిబిడ్డా క్షేమంగా ఉన్నట్టు వైద్యులు వెల్లడించారు. దీంతో ప్రియ పాత్ర కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు.

## దుర్గమ్మ భక్తులకు గుడ్‌న్యూస్.. ఇక నుంచి ఆన్‌లైన్ ద్వారా సేవలు

**విజయవాడ, (రాజధాని వార్తలు):** ఇంద్రకీలాద్రి కనకదుర్గమ్మ ఆలయానికి వచ్చే భక్తులకు మరింత సౌకర్యం కల్పించే దిశగా దేవాదాయ శాఖ మరో కీలక నిర్ణయం తీసుకుంది. భక్తుల కోసం ఆన్‌లైన్ సేవలను అధికారికంగా ప్రారంభించింది. దర్శన టిక్కెట్లు, సేవా పూజలు, ప్రసాదం, వసతి గదుల బుకింగ్ వంటి అనేక సేవలను ఇకపై ఆన్‌లైన్ ద్వారా పొందవచ్చని తెలిపింది. క్యూలైన్లలో వేచి ఉండే సమయాన్ని తగ్గించడమే లక్ష్యంగా ఈ డిజిటల్ సేవలను ప్రవేశపెట్టినట్లు దేవాదాయ శాఖ పేర్కొంది. నగదు రహిత చెల్లింపులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఏపీ ప్రభుత్వం ఈ చర్యలు చేపట్టిందని వెల్లడించింది. 'మన మిత్ర' వాట్సాప్ సేవలు ప్రారంభిస్తున్నట్లు ప్రకటించింది.

**వాట్సాప్ ద్వారా..**

వాట్సాప్ నంబర్ 9552300009ను వినియోగించుకోవాలని సూచించింది. దర్శనం, ప్రసాదం, పూజా సేవల వివరాలు వాట్సాప్ ద్వారా అందుబాటులో ఉంటాయని తెలిపింది. అధికారిక వెబ్‌సైట్ ద్వారా ముందస్తు బుకింగ్ సౌకర్యం కల్పిస్తున్నట్లు వెల్లడించింది. భక్తులు తమకు కావాల్సిన వివరాల కోసం వెబ్‌సైట్ : www.ap temples.ap.gov.in ని లో సంప్రదించాలని సూచించింది. శీఘ్ర దర్శనం, ప్రత్యేక దర్శనం టిక్కెట్లు ఆన్‌లైన్‌లో



లభ్యమవుతాయని వెల్లడించింది.

**ఆర్జిత సేవలు..**

అమ్మవారికి నిర్వహించే ఆర్జిత సేవలు ఆన్‌లైన్ బుకింగ్ ద్వారా పొందవచ్చని చెప్పుకొచ్చింది. దేవస్థాన వసతి గదుల కేటాయింపు ఆన్‌లైన్ ద్వారా బుక్ చేసుకోవచ్చని తెలిపింది. ఇంద్రకీలాద్రి ప్రాంగణంలో ప్రత్యేక డిజిటల్ కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు పేర్కొంది. క్యూఆర్ కోడ్, కార్డ్, నెట్ బ్యాంకింగ్ ద్వారా చెల్లింపుల సౌకర్యం కల్పిస్తున్నట్లు స్పష్టం చేసింది. దళారులను నమ్మవద్దని దేవస్థానం అధికారులు హెచ్చరించారు. ప్రభుత్వం కల్పించిన అధికారిక సేవలనే వినియోగించుకోవాలని దేవస్థానం అధికారులు విజ్ఞప్తి చేశారు.

## అమరావతి అభివృద్ధిలో మరో కీలక అడుగు..కొత్త పనులకు గ్రీన్ సిగ్నల్

**అమరావతి, (రాజధాని వార్తలు):** అమరావతిలో పలు ప్రాజెక్టులకు ల్యాండ్ పూలింగ్ జరుగుతోందని ఏపీ పురపాలక శాఖ మంత్రి నారాయణ వ్యాఖ్యానించారు. అమరావతి మండలంలోని 3 గ్రామాల్లో మొదటి రోజే 1000 ఎకరాలు పూలింగ్‌కు ఇచ్చారని పేర్కొన్నారు. అంటే మూడు గ్రామాల్లో 25 శాతం ల్యాండ్ పూలింగ్ పూర్తి అయిందని చెప్పుకొచ్చారు. అమరావతి మండలం కర్లపూడిలో మంగళవారం రోడ్డు పనులకు మంత్రి నారాయణ, ఎమ్మెల్యే బాష్యం ప్రవీణ్ శంకుస్థాపన చేశారు. నిన్న ల్యాండ్ పూలింగ్ ప్రారంభానికి వెళ్లిన మంత్రిని రోడ్డు వేయాలని రైతులు కోరారు. రైతులు అడిగిన వెంటనే రోడ్డు నిర్మాణానికి అంచనాలు సిద్ధం చేయించి.. కాంట్రాక్ట్ సంస్థకు పనులు అప్పగించారు. కర్లపూడి నుంచి అనంతవరం వరకు.. 2.9 కిలోమీటర్ల రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. వారం రోజుల్లో రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని కాంట్రాక్ట్ సంస్థకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు.

**స్పోర్ట్స్ సిటీ అవసరం..**

భూములిచ్చిన రైతులను తాను ప్రత్యేకంగా అభినందిస్తున్నానని అన్నారు. ఎమ్మెల్యే ప్రవీణ్ దగ్గరుండి రైతులను ఒప్పిస్తున్నారని తెలిపారు. అమరావతి అభివృద్ధి జరగాలంటే ఇన్నర్ రింగ్ రోడ్డు, ఇంటర్నేషనల్ స్పోర్ట్స్ సిటీ అవసరమని చెప్పుకొచ్చారు. నెల రోజుల్లోగా 80 శాతం భూమి ల్యాండ్ పూలింగ్ ద్వారా తీసుకుం



టానని ఎమ్మెల్యే ప్రవీణ్ చెప్పారని అన్నారు. 80 శాతం పూలింగ్ పూర్తి కాగానే మాస్టర్ ప్లాన్ డిజైన్ చేసి, టెండర్లు పిలుస్తామని వెల్లడించారు. రైతులకు ఇచ్చే ప్లాట్‌లలో ముందుగా రెండు వరుసల రోడ్డు పూర్తి చేస్తామని తెలిపారు. కర్లపూడిలో 3.9 కిలోమీటర్ల రోడ్డు బాగోలేదని నిన్న గ్రామ సభలో అడిగారని అన్నారు. వెంటనే రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశామని.. వీలైనంత త్వరగా పనులు పూర్తి చేస్తామని మంత్రి నారాయణ పేర్కొన్నారు.

## భద్రతా దళాలు, ఉగ్రవాదుల మధ్య ఎదురు కాల్పులు




**జమ్ము కాశ్మీర్:** కథువా జిల్లాలో మంగళవారం మధ్యాహ్నం నుంచి భద్రతా దళాలు, ఉగ్రవాదులకు మధ్య భారీ ఎన్‌కౌంటర్ కొనసాగుతోంది. పాకిస్థాన్‌కు చెందిన జైష్-ఎ-మహమ్మద్ (ఏఓ) ఉగ్రవాదులు కథువా జిల్లా బిల్లావర్ ప్రాంతంలో సంచరిస్తున్నారన్న పక్కా సమాచారంతో ఆర్మీ, సీఆర్పీఎఫ్, జమ్మూ కాశ్మీర్ పోలీసు ప్రత్యేక బృందం సంయుక్తంగా గాలింపు చర్యలు చేపట్టాయి. ప్రస్తుతం నజోట్ అటవీ ప్రాంతంలో ఈ కాల్పులు కొనసాగుతున్నాయి. ఈ అటవీ ప్రాంతంలో ఇద్దరు లేదా ముగ్గురు ఉగ్రవాదులు దాగి ఉన్నట్లు భద్రతా బలగాలు అనుమానిస్తున్నాయి. ముఖ్యంగా జైష్-ఎ-మహమ్మద్ సంస్థకు చెందిన కమాండర్ ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. కాకపోతే దీనిపై ఎలాంటి క్లారిటీ భద్రతా బలగాలు ఇవ్వలేదు. ఇప్పటివరకూ ఇరువైపుల నుంచి ఎవరికీ గాయాలు, ప్రాణ హాని జరగలేదని భద్రతా దళాలు చెబుతున్నాయి. గత వారం కూడా.. కహోగ్ అటవీ ప్రాంతంలో భద్రతా దళాలు, ఉగ్రవాదుల మధ్య కాల్పుల ఘటన జరిగింది. చికట్లో ఉగ్రవాదులు కొండప్రాంతాలను ఆసరాగా చేసుకొని తప్పించుకున్నట్లు తెలుస్తోంది.

# ఘనంగా స్వామి వివేకానంద 164వ జయంతి





**భీమునిపట్నం, (రాజధాని వార్తలు):** జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా భీమిలి "యువ భారత్ మరియు వివేకానంద రీడింగ్ రూము ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో స్వామి వివేకానంద 164వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వక్తలు యువ భారత్ వ్యవ స్థాపక సలహాదారులు గాడు ఎల్లాజీరావు, అసిస్టెంట్ లేబర్ కమిషనర్, భీమిలి యువ భారత్ శాఖ కన్వీనర్ సంకురుభుక్త జోగారావు మరియు గాడు పైడిరాజు, దత్తి ఈశ్వరరావు, యస్. ఆనందరావు, ఎ. అప్పలనాయుడు, బొట్ట ఈశ్వరరావు తదితర విశ్రాంత ప్రధానోపాధ్యాయులు వివేకానంద స్వామి యొక్క గణతను విపులంగా వివరించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన "స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషను వ్యవస్థాపకులు కలిగొట్ల శ్రీరామ్ మూర్తికి ఈ సందర్భంగా చిరు సత్కారం చేసారు. అనంతరం "వివేకా నంద జీవితం – యువతకు స్ఫూర్తిదాయకం" అనే అంశంపై వ్యాస రచన పోటీలో గెలుపొందిన విజేతలకు బహుమతులు మరియు ప్రశంసా పత్రాలు అందజేయడం జరిగింది. ఈ కార్యక్ర మంలో మాజీ ఎన్.జి.ఓ కార్యదర్శి కంటుభుక్త ముత్యాలరావు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, 3వ వార్డు టిడిపి అధ్యక్ష, కార్యదర్శులు గొలగాని నరేంద్ర, అప్పలనాయుడు యువ భారత్ సభ్యులు పాల్గొన్నారు.

# జాయింట్ ఎల్‌పిఎంలు తొలగించాలి

## - పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీపై కలెక్టర్ ఎస్.రామ సుందర్ రెడ్డి సమీక్ష





**విజయనగరం, (రాజధాని వార్తలు):** జాయింట్ ఎల్‌పిఎంలు తొలగించి, తప్పులు లేని పట్టాదారు పాసుపుస్తకాలను పంపిణీ చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్ రాంసుందర్ రెడ్డి ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ ఎస్ సేధు మాధవన్‌తో కలిసి రెవెన్యూ అధికా రులతో సోమవారం జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిం చారు. పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ, రెవెన్యూ క్లినిక్, ఐవిఆర్ఎస్ సర్వే తదితర అంశాలపై సమీక్షంచారు. ఈ సంద ర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీపై అసంతృప్తిని వ్యక్తం చేశారు. పంపిణీ వేగంగా జరగడం లేదని, ఐవిఆర్ఎస్ సర్వేలో కూడా వివిధ అంశాలపై జిల్లా ప్రజలు అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. వీటిని సరిదిద్ది, వేగంగా పంపిణీ పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలో సుమారు లక్ష వరకు జాయింట్ ఎల్పీఎంలు ఉన్నాయని, వీటిని తొలగించి, తప్పులు లేని పాస్ పుస్తకాలను పంపిణీ చేయాలని సూచించారు. జెసి సేధు మాధవన్ మాట్లాడుతూ జాయింట్ ఎల్పీఎంలను సరిదిద్దే అవకాశాన్ని ప్రభుత్వం తాసిల్దార్లకు ఇచ్చిం దని చెప్పారు. తప్పులు సరిదిద్దడానికి ఇదొక అవకాశమని, ఎటువంటి తప్పులు లేకుండా పాసు పుస్తకాలను అందించాలని ఆదేశించారు. 423 గ్రామాలకు సంబంధించి సుమారు లక్ష,54 వేల పాసుపుస్తకాలను పంపిణీ చేయాల్సి ఉందని చెప్పారు. అదేవిధంగా ప్రస్తుతం జరుగుతున్న రీ సర్వే ఏ గ్రామంలో పూర్తి అయితే, ఆ గ్రామంలో ఖచ్చితమైన వివరాలతో వెంటనే పాసు పుస్తకాలను పంపిణీ చేయాలని ఆదేశించారు. డిసెంబర్ లోగా ఈ ప్రక్రియ పూర్తి కావాలని స్పష్టం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్లో డియార్వో ఇ.మురళి, ఆర్డీవోలు డి.కీర్తి, రామ్మోహన్, సత్యవాణి, తాసిల్దార్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# సాంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** సాంప్రదాయాలకు ప్రతీకగా నిలిచిన సంక్రాంతి పర్వదినాన్ని జర్నలిస్టులంతా ఆనం దమయంగా జరుపుకోవాలని జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు, డాక్ యార్డ్ కేటీబీ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు గంట్ల శ్రీనుబాబు ఆకాంక్షంచారు.పెద్ద పండుగ సందర్భంగా మూడో రోజు సోమవారం కూడా అక్కయ్యపాలెంలోని ఒక ప్రయి వేటు కార్యాలయంలో జర్నలిస్టులకు గంట్ల శ్రీనుబాబు చేతులు మీదుగా కానుకలు అందజేశారు. ప్రతీ ఏటా మాదిరిగానే ఈ ఏడాది కూడా ఒక్కొక్కరికి మూడు కేజీలు కొత్తబెల్లం, సింహాచలం అప్పన్న అలంకరణలతో కూడిన 2026 క్యాలెండర్ , అలాగే ప్రత్యేక బహుమతులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా తన సొంత నిధులతోనే ఆయా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. రసాయనాలు మిలితం కాని 1500 కేజీల బెల్లం పూజాది కార్యక్రమాలకు వినియోగించుకునే విధంగా జర్నలిస్టులకు అందజేస్తున్నామ న్నారు. అలాగే సింహాద్రినాథుడు అలంకరణలతో కూడిన క్యాలెండర్ అందజేశామన్నారు.

**జర్నలిస్టుల సంక్షమానికి కృషి**

జర్నలిస్టుల సంక్షమానికి తమ వంతు కృషి చేయడం జరుగు తుందని గంట్ల శ్రీనుబాబు చెప్పారు. జర్నలిస్టులకు అక్రిడేషన్లు ఇళ్ల స్థలాలు పెన్షన్ అమలుతో పాటు 11 డిమాండ్లతో ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మంత్రి నారా లోకేష్ లకు వినతి పత్రాలు సమర్పించడం జరిగిందన్నారు. అలాగే సంక్రాంతి తర్వాత మరోసారి ముఖ్యమం త్రిని కలిసి జర్నలిస్టు సమస్యలపై తమ యూనియన్ ద్వారా విన్నవించడం జరుగుతుందన్నారు. పలు సమస్యలు పరిష్కారానికి తమ వంతు ప్రయత్నం చేస్తామన్నారు.

# సోషల్ మీడియా ద్వారా ప్రజలకు చేరువు కావాలి

## - వైసిపి పథకాలు, పోరాటాలు ప్రజల్లోకి తీసుకు వెళ్లండి - దక్షిణ సోషల్ మీడియా వింగ్ సమావేశంలో వాసుపల్లి వెల్లడి

**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** బూత్ స్థాయి నుంచి వైసీపీ సోషల్ మీడియాను బలోపేతం చేయాలనీ మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ పిలుపు ఇచ్చారు. సౌత్ మీడియా అధ్య క్షుడు బేవర మహేష్ ఆధ్వర్యంలో ఆశీలమెట్ట కార్యాలయంలో సోమవారం సౌత్ సోషల్ మీడియా బృందంతో సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా వాసుపల్లి మాట్లాడుతూ, గత వైసీపే సర్కార్ హయంలో అమలు చేసిన ప్రతి సంక్షమ పథకం ప్రజలు మర్చిపోలేదని పేర్కొన్నారు. నవరత్నాలు పేరిట ఉన్న పథకాలు అమలు చేసిన ఘనత మాజీ సీ ఎం జగన్‌దే అన్నారు. ఈ పథకాలకు సంబంధించిన వీడియోలు ప్రజలు అందరికీ చేరేలా సోషల్ మీడియా వింగ్ కృషి చేయాలి అన్నారు. వైసీపీ చేపట్టే అన్ని ఆందోళన కార్యక్రమాలు సోషల్ మీడియా ద్వారా ప్రజలకు చేరాలని అన్నారు. కూటమి సర్కార్ వచ్చిన తరువాత కొత్త పెన్షన్లు ఇవ్వలేదని విమర్శించారు. అలాగే, 50 ఏళ్ళు నిండిన వారికి పెన్షన్లు ఇవ్వడం లేదని వాపోయారు. అలాగే, 18 ఏళ్ళు నిండిన మహిళలకు ఇస్తామన్న నగదు ఇవ్వడం లేదన్నారు. ఈ విషయాల మీద సైతం వీడియోలు తాయారు చేసి సోషల్ మీడియాలో



విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. కాగా, రాజకీయంగా వ్యక్తిగతంగా ఎవరినీ సోషల్ మీడియాలో టార్గెట్ చేయొద్దని హితవు పలికారు. వచ్చేది వైసీపీ ప్రభుత్వమే అని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్టేట్ అధికార ప్రతినిధి కొండా రాజీవ్ గాంధీ, జిల్లా జనరల్ సెక్రటరీ గానగాళ్ల రామరాజు,జిల్లా బీసీ సెల్ ప్రెసిడెంట్ సనపల రవీంద్ర భారత్, స్టేట్ మేధావుల విభాగం సెక్రెటరీ విజయ్ జిల్లా సోషల్ మీడియా నాయకులు అన్నామని, బొడ్డు ఆనంద్, అరుగుల రాజు, ఆకులా శ్యామ్, వార్డ్ సోషల్ మీడియా ప్రెసిడెంట్‌లు మరియు కమిటీ దక్షణ వైసీపీ శ్రేణులు నాయకులు పాల్గొన్నారు.

# క్రీడలు జాతీయ సమైక్యతను పెంపొందిస్తాయి

## - లోకసత్తా అధ్యక్షుడు బీశెట్టి బాబ్జి
## - వేడుకగా వాలీబాల్ పూర్వ క్రీడాకారుల అపూర్వ కలయిక





**విజయనగరం, (రాజధాని వార్తలు):** క్రీడలు జాతీయ సమైక్యతను పెంపొందిస్తాయని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బీశెట్టి బాబ్జి అన్నారు. నగరంలోని సిటీ క్లబ్‌లో జిల్లా వాలీబాల్ అసోసియేషన్ పూర్వ క్రీడాకారుల అపూర్వ కలయిక వేడుకలు ఆదివారం జరిగాయి. ఈ సందర్భంగా వాలీబాల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి టీవీ భగవాన్ దాస్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి బీసెట్టి బాబ్జి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో తొలుత అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, ఇటీవల విశాఖపట్నం పోర్ట్ ట్రస్ట్‌లో ఉద్యోగ విరమణ చేసిన గవర సూరిబాబును భీశెట్టి బాబ్జితోపాటు, జిల్లా క్రీడాభివృద్ధి శాఖ అధికారి వెంకటేశ్వరరావు, సిటీ క్లబ్ ప్రతినిధి రంగారావు దొర తదితరులు ఘనంగా సత్కరిం చారు. సూరిబాబుకు దుస్సాలువ కప్పి జ్ఞాపికను, సన్మాన పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో బాబ్జి మాట్లాడుతూ జిల్లాలో వాలీబాల్ అసోసియేషన్ క్రమశిక్షణతో ముందుకు వెల్తూ క్రీడా భివృద్ధికి కృషి చేస్తున్నదని అన్నారు. వాలీబాల్ క్రీడ అభివృద్ధికి భగవాన్ దాస్ నాలుగు దశాబ్దాలుగా చేస్తున్న కృషి అభినందనీ యమని అన్నారు. కార్యక్రమంలో జిల్లా క్రీడాభివృద్ధి అధికారి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాకు చెందిన వాలీబాల్ క్రీడాకారులు రాష్ట్ర జాతీయ స్థాయిలో రాణించి జిల్లాకు కీర్తి ప్రతిష్టలు పెంచుతున్నారని, ఆ ఒరవడి కొనసాగించేందుకు కృషి చేయాలని అన్నారు. విజయనగరంలో క్రీడాభివృద్ధికి అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు ఉన్నాయని, తన సహకారం ఎల్ల ప్పుడూ ఉంటుందని సదుపాయాలను సద్వినియోగం చేసుకోవా లని అన్నారు. నైపుణ్యం గల క్రీడాకారులకు, జాతీయ అంతర్జా తీయ స్థాయిలో రాణిస్తున్న వారికి పరీక్షలతో సంబంధం లేకుండా నేరుగా ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయించిం దని ఇది శుభపరిణామం అని అన్నారు. అసోసియేషన్ అపూర్వ కలయుకకు అధిక సంఖ్యలో క్రీడాకారులు రావడం ఆనందకర మని అన్నారు. కార్యక్రమంలో భగవాన్ దాస్ మాట్లాడుతూ ఏటా ఈ అపూర్వ కలయిక నిర్వహించేందుకు అసోసియేషన్ తీర్మా నించిందని అన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా క్రీడాకారులతో పాటు విశాఖపట్నం, హైదరాబాద్, రాయపూర్ తదితర ప్రాంతాల్లో స్థిరపడిన పూర్వ పురుష, మహిళా క్రీడాకారులు హాజరు కావడం గమనార్హం. సమావేశానికి ముందు మున్సిపల్ స్టేడియంలో పూర్వ క్రీడాకారుల ఫ్రెండ్లీ మ్యాచ్లు జరిగాయి. క్రీడాకారులు అందరికీ పూర్వ క్రీడాకారులు ఎస్ వి ఎల్ జగన్నాధరావు, సంధ్య సమకూర్చిన టీ షర్టులను, ట్రాక్ షూట్‌లను వితరణగా అందజే శారు. ఈ కార్యక్రమంలో భగవాన్ దాస్‌తో పాటు అసోసియేషన్ ప్రతినిధులు గవర సూరిబాబు, టి ఏ వి ఎన్ రాజు (చిన్నారి), కృష్ణంరాజు, కొంచాడ సన్యాసినాయుడు, ఎస్.వి.ఎల్ జగన్నాధ రావు, సోమశేఖర్, మహ్మద్ అబ్దుల్ సలీం తదితరులు పాల్గొన్నారు.

# అభినందన చందనం

**విజయనగరం, (రాజధాని వార్తలు):** ఆల్ ఇండియా బార్ కౌన్సిల్ పరీక్షలో ఉత్తీర్ణులై న్యాయవాదిగా ప్రాక్టీస్ చేయటానికి అర్హత సాధించిన వైసిపి మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, నగర మున్సిపల్ డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణిని నియోజక వర్గ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా సన్మానిం చారు. మాజీ డిప్యూటీ స్పీకర్, నియోజకవర్గ సమన్వయకర్త కోలగట్ల వీరభద్ర స్వామి నివాసంలో వైసిపి నగర అధ్యక్షులు ఆశపు వేణు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో నగర ఫ్లోర్ లీడర్ ఎస్.వి.వి రాజేష్ మరియు వైసిపి నియోజకవర్గ యువజన మరియు విద్యార్థి విభాగాల ఇన్చార్జ్ జి కౌశిక్ ఈశ్వర్ మాట్లాడుతూ ఎంతటి విజయమైనా కుటుంబ సభ్యుల సమన్వయంతోనే సాధించగలమని తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. కోలగట్ల శ్రావణి మాట్లాడుతూ నేను చదివిన ఈ చదువుకి



మీ కన్నబిడ్డలా నన్ను భావించి సంతోషాన్ని వ్యక్తపరుస్తూ శుభా కాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేశారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బలపడే విధంగా నేను ఈ చదివిన చదువు ఉపయోగపడుతుందని నమ్ముతూ న్యాయశాస్త్రాన్ని అభ్యసించానని ఆమె పేర్కొన్నారు.

# ప్రత్యామ్నాయ కన్జ్యూమర్ వివాద పరిష్కారంలో సిఆర్సి మైలురాయి

## - సిఆర్సి జాతీయ అధ్యక్షులు డాక్టర్ వికాస్ పాండే వెల్లడి - తొలిసారిగా 12 మంది సిఆర్సి సభ్యులకు మధ్యవర్తిత్వ న్యాయ పరిష్కార శిక్షణ - సర్టిఫికెట్లు బహుకరించిన పోలీస్ కమిషనర్, కన్జ్యూమర్ కోర్టు న్యాయమూర్తి





**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** ప్రత్యామ్నాయ వివాద పరిష్కార రంగంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం చారిత్రాత్మక మైలురాయిని కన్స్యూమర్ రైట్స్ కౌన్సిల్ (సిఆర్సి) సాధించింది.ఈ కార్యక్రమం రాష్ట్రంలో మధ్యవర్తిత్వ, వినియోగదారుల న్యాయం వ్యవస్థలను బలపరచే కీలక అడుగుగా నిలిచింది. కన్స్యూమర్ రైట్స్ కౌన్సిల్ (సిఆర్సి) జాతీయ అధ్యక్షులు డాక్టర్ వికాస్ పాండే బృందం 12 మంది సభ్యులతో ఆంధ్రప్రదేశ్‌లో అధికారికంగా శిక్షణ పొందిన తొలి మధ్యవర్తులుగా గుర్తింపు పొందారు. తొలి సారిగా విశాఖ నగరంలో డాల్ఫిన్ హోటల్ సమావేశ మందిరంలో నిర్వహించిన ఈ మధ్యవర్తిత్వ శిక్షణ కార్యక్రమం కన్స్యూ మర్ రైట్స్ కౌన్సిల్, ఐఏఎంసి సహకారంతో నిర్వహించారు.

శిక్షణను అంతర్జాతీయ స్థాయి ఆర్బిట్రేటర్, మధ్యవర్తి నిపుణులు ఎ.జె.జవాద్, వారి నిపుణుల బృందం శిక్షణ సమగ్రంగా అందిం చారు. సర్టిఫికెట్ ప్రదానోత్సవ వాలెడిక్టరీ సెరిమనీ ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి హాజరైన ముఖ్య అతిధు లుగా విశాఖపట్నం అదనపు జిల్లా న్యాయమూర్తి, పోలీస్ కమిషనర్, డిజిపి డాక్టర్ శంఖ్ బ్రత బాగ్చీ, జిల్లా వినియోగదారుల కోర్టు న్యాయమూర్తి డాక్టర్ జి. తనూజ హాజరయ్యారు. కన్జ్యూమర్ కేసుల్లో మధ్యవర్తి వహించే విధంగా సభ్యులకు శిక్షణ ఇచ్చిన అంతర్జాతీయ స్థాయి ఆర్బిట్రేటర్, మధ్యవర్తి నిపుణులు ఎ. జె. జవాద్‌కి డాక్టర్ వికాస్ పాండే తన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రజల వివాదాలను ఉచిత మధ్యవర్తిత్వ సేవల ద్వారా పరిష్కరించేందుకు తమ బృందం కట్టుబడి ఉందని తెలిపారు.

ఇది శాంతియుత, వేగవంతమైన తక్కువ ఖర్చుతో వివాద పరిష్కారానికి దోహదం చేస్తుందన్నారు. ఉచిత లీగల్ కన్సల్టేషన్ కోసం 99636 33653 నంబర్‌కు కాల్ చేయవచ్చునన్నారు. www.crcbharat.com వెబ్‌సైట్‌లో సందేహాలు, ఫిర్యాదులు రిజిస్టర్ చేసుకోవచ్చునన్నారు.ఈ శిక్షణలో మధ్యవర్తిత్వానికి సంబంధించిన సిద్ధాంతం, ప్రాయోగిక అంశా లపై లోతైన అవగాహన కల్పించబడింది. శిక్షణ పొందిన సభ్యులు అడ్వకేట్ డాక్టర్.ఆర్.శ్రీరాములు, డాక్టర్. త్రినాధ్ అడ్వకేట్ సుకన్య ప్రియ, డాక్టర్. దొడ్డి చంద్రశేఖర్, శరత్ చంద్ర, కె.అవి నాష్ శంకర్, అడ్వకేట్ దివ్య భారతి,ముజీర్ అడ్వకేట్ రాజేంద్ర ప్రసాద్, రామకృష్ణ జీ షంవీర్ చౌహాన్ కు సర్టిఫికెట్ ప్రదానో త్సవం విశాఖ నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖ్ బ్రత బాగ్చీ, వినియోగదారుల కోర్టు న్యాయమూర్తి డాక్టర్ జి. తనూజ చేతుల మీదుగా నిర్వహించారు.

# కోడి పందాలు, పేకాట లాంటి జూదాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకోవాలి

## - ముద్దా పిచ్చయ్య దళిత సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు డిమాండ్



**ఎటపాక, (రాజధాని వార్తలు):** సంక్రాంతి పేరుతో కోడిపందాలు, పేకాట లాంటి జూదాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని దళిత సంక్షమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు ముద్దా పిచ్చయ్య అధికారుల్ని డిమాండ్ చేశారు. ఎటపాక మండలంలో వివిధ ప్రాంతాలలో సంక్రాంతి సంబరాల పేర్లతో కోడి పందాలు, పేకాట, గుండాటలాంటి జూదాలు నిర్వహించటానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని ఇలాంటి ప్రయత్నాలను అధికారులు అడ్డుకోవాలని కోరుతున్నాము. సంక్రాంతి వేడుకలు అంటే జూదాలు కాదని, వినోదనాత్మకమైన కార్యక్రమాలు నిర్వహించుకోవాలని అన్నారు. గతంలో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు కోడిపందాలను నిషేధం విధించిందని గుర్తు చేశారు. కోడి పందాలు పేకాట లాంటి జూదాలు నిర్వహించటం వలన ఎక్కువగా నిరుపేద ప్రజలే ఆర్థికంగా నష్టపోతున్నారు అని అన్నారు. ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించే ప్రాంతంలో విచ్చలవిడిగా మద్యం, నాటు సారా అమ్మకాలు జరపడం వలన శాంతిభద్రతల సమస్యలు కూడా తలెత్తుతున్నాయని అన్నారు. గతంలో కూడా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించే ప్రాంతంలో గొడవలు,దాడులు జరిగాయని గుర్తు చేస్తున్నాము. అధికారులు తక్షణం స్పందించి ఎట్టపాక మండలంలో వివిధ ప్రాంతాలలో నిర్వహించ తలపెట్టిన కోడిపందాలు, పేకాట లాంటి జూదాలను అరికట్టాలని కోరుతున్నాం. ఎటపాక మండల అధికారులు ఇటువంటి కార్యక్రమాలపై స్పందించకుంటే ఉన్నతాధికారులకు తెలియజేస్తామని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాము.

# తపాలా శాఖ విలీనంపై ప్రజలు నిరసన



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** సామర్లకోటలో తపాలా శాఖా తీరుపై పెన్షన్ లైన్ ప్రజలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. సామర్లకోట పిఠాపురం రోడ్డులో గల పెన్షన్ లైన్ పోస్ట్ ఆఫీస్‌ను అధికారులు పెద్ద పోస్టాఫీస్‌లో విలీనం చేసినట్లు ప్రకటించడం పట్ల తీవ్ర ప్రజలు నిరసన వ్యక్తం చేశారు. సుమారు 70 సంవత్సరాల నుండి ఈ ప్రాంత ప్రజలు పోస్ట్ ఆఫీస్‌లో అకౌంట్‌లు ఓపెన్ చేసుకొని, కొనసాగిస్తుండగా ఇప్పుడు పోస్ట్ ఆఫీస్ లేకపోవడంతో అకౌంట్లో కలిగిన వృద్ధుల పరిస్థితి ఇబ్బందికరంగా ఉంటుందని ప్రజలు వాపోతున్నారు. దీనిపై సామర్లకోటలో నాలుగు పోస్ట్ ఆఫీస్ ఉండగా ఇప్పటికే వాటిని తొలగించడం దారుణమని మానవ హక్కుల సంఘం జిల్లా అధ్యక్షులు నూతలపాటి అప్పలకొండ ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే పెన్షన్ లైన్లు పోస్ట్ ఆఫీసులు పునరుద్ధరించాలని అప్పలకొండ డిమాండ్ చేశారు. తపాల శాఖ తీరు పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారుల వైఖరి వల్లే తపాల శాఖ రోజురోజుకు క్షణిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మానవ హక్కుల సంఘం నాయకులు జుత్తుక అప్పారావు, ఖాతాదారులు పాల్గొన్నారు.

# "గజపతినగరం" ప్రీమియర్ లీగ్ విజేత త్రివేది థండర్స్

## - విన్నర్స్ ట్రోఫీ, రన్నర్స్ ట్రోఫీ, మ్యాన్ ఆఫ్ ది సిరీస్, మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌తో సహా అన్ని ట్రోఫీలను స్పాన్సర్ చేసిన తుమ్మలగుంటి సూర్యనారాయణ మూర్తి (బుజ్జి)










**గజపతినగరం, (రాజధాని వార్తలు):** ఈనెల 10, 11, 12 తేదీలలో మూడు రోజులపాటు ఉత్సాహంగా సాగిన గజపతి నగరం ప్రీమియర్ లీగ్ సోమవారం నాడు జరిగిన ఫైనల్ మ్యాచ్‌తో ముగిసిందని నిర్వాహకులు తెలియజేశారు. మూడు రోజులపాటు ఆధ్యంతం ఉత్కంఠ భరితంగా జరిగిన ఈ లీగ్‌లో నాలుగు జట్లైన లక్ష్మ ఎంటర్ప్రైజెస్ టీమ్, డ్రీమ్స్ బ్రోస్ 11, మహేష్ వారియర్స్, త్రివేదీ థండర్స్ పాల్గొన్నాయి. జిపిఎల్ ప్రీమియర్ లీగ్ టోర్నమెంట్లో విజేతగా త్రివేది థండర్స్ జట్టు విజేతగా నిలిచింది.

ఫైనల్ పోరులో త్రివేది థండర్స్ మరియు మహేష్ వారియర్స్ తలపడగా మొదట బ్యాటింగ్ చేసిన త్రివేది టెండర్స్ నిర్ణీత 12 ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయి 145 పరుగులు చేశారు. అనంతరం 146 పరుగులు విజయ లక్ష్యముతో బరిలో దిగిన మహేష్ వారియర్స్ 7 వికెట్లు కోల్పోయి 99 పరుగులు మాత్రమే చేయగలిగింది. ఈ మ్యాచ్లో త్రివేది తండర్స్ బ్యాట్స్మెన్ పృథ్వి 65 పరుగులు చేసి మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచాడు. మ్యాన్ ఆఫ్ మ్యాచ్, మ్యాన్ ఆఫ్ ద సిరీస్, ఉత్తమ బ్యాట్స్మెన్‌గా పృద్వి నిలవగా, బెస్ట్ బౌలర్‌గా రాకేష్, బెస్ట్ ఫీల్డర్‌గా శంకర్ నిలిచారు. గెలుపొందిన జట్టుకు 10,000- నగదు బహుమతిని (డే & నైట్ రెస్టారెంట్) బొండపల్లి వారు స్పాన్సర్ చేయగా రన్నర్ జట్టుకు.5,000/- నగదు బహుమతిని
తాళ్లపూడి సౌమిత్రి త్రివేది స్పాన్సర్ చేశారు. ప్రీమియర్ లీగ్ అన్ని మ్యాచ్లకు ఘన, రాము ఎంపైర్లుగా నిలిచారు. అనంతరం కర్రీ నానాజీ, తుమ్మలగుంటి బుజ్జి, తాడి శ్రీనివాసరావు, శిరువూరి శ్రీనివాసరాజు మాక్రో ఇన్ఫో టెక్ (కంప్యూటర్ సెంటర్ రాజు), కరణం గణ, శంకరరావు, ఖల్నాయక్ రాజు, బూర్ల రాము చేతుల మీదుగా విజేతలకు బహుమతులు అందజేశారు. తన సతీమణి తుమ్మలగుంటి రజిని జ్ఞాపకార్థం ట్రోఫీలను స్పాన్సర్ చేసినట్లు తుమ్మలగుంటి బుజ్జి విలేకరులకు తెలియజేశారు.

# యువతకు క్రీడలే సరైన మార్గం : సీఐ సిహెచ్ వాసు నాయుడు





**ఆనందపురం, (రాజధాని వార్తలు):** క్రీడలు యువత జీవితానికి క్రమశిక్షణను, ఆత్మవిశ్వాసాన్ని అందిస్తాయని ఆనందపురం సీఐ సిహెచ్ వాసు నాయుడు అన్నారు. క్రీడల్లో చురుగ్గా పాల్గొనే యువత తప్పుదోవ పట్టే అవకాశాలు తక్కువగా ఉంటాయని ఆయన స్పష్టం చేశారు. గొట్టిపల్లిలో జరుగుతున్న శ్రీ సీతారామ తీర్థ మహోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన గొట్టిపల్లి ప్రీమియర్ లీగ్-3 (జిపిఎల్-3) క్రికెట్ టోర్నమెంట్‌ను ఆదివారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడిన సీఐ, విద్యతో పాటు క్రీడల్లో ప్రతిభ చూపితే ఉద్యోగ అవకాశాలు విస్తృతంగా లభిస్తాయని తెలిపారు. క్రీడల ద్వారా శారీరక దృఢత్వంతో పాటు మానసిక స్థైర్యం పెరుగుతుందని, యువత లక్ష్యన్ని నిర్దేశించుకొని నిరంతర సాధనతో ముందుకు సాగాలని ఆయన సూచించారు. గెలుపు-ఓటములను సమానంగా స్వీకరించడమే నిజమైన క్రీడా స్ఫూర్తి అని పేర్కొన్నారు. అనంతరం సీఐ వాసు నాయుడు బ్యాటింగ్ చేసి టోర్నమెంట్‌ను అధికారికంగా ప్రారంభించారు. జిపిఎల్ వ్యవస్థాపకుడు ఎద్దు వీరస్వామి మాట్లాడుతూ గతంలో రెండు జిపిఎల్ టోర్నమెంట్లు విజయవంతంగా నిర్వహించామని, ఈసారి మూడవ టోర్నమెంట్‌గా జిపిఎల్-3ను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ టోర్నమెంట్‌లో ఐదు జట్లు పోటీపడుతున్నాయని, విజేతలు మరియు రన్నర్‌అప్‌లకు నగదు బహుమతులతో పాటు ట్రోఫీలను తీర్థ మహోత్సవం రోజున దాతల సహకారంతో అందజేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కోరాడ వెంకట నరసింహనాయుడు (వెంకట్రావు), శ్రీ సత్యసాయి ఆదర్శ గ్రామం కోఆర్డినేటర్ డబ్బీరు విజయ్ కుమార్, ఫిజికల్ డైరెక్టర్లు బుత్తల సత్యం, బుత్తల రాము, కంది సత్తిబాబు, కేశా నాగేశ్వరరావు, టోర్నమెంట్ నిర్వాహకులు, ఐదు జట్ల ఫ్రాంచైజీ యజమానులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

# "యువత"తోనే దేశానికి ఉజ్వల భవిష్యత్తు

## - మేజిస్ట్రేట్ ఏ.విజయ్ రాజ్ కుమార్



**గజపతినగరం, (రాజధాని వార్తలు):** యువతతోనే దేశానికి ఉజ్వల భవిష్యత్తు సాధ్యమని స్థానిక ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ఏ.విజయ్ రాజ్ కుమార్ అన్నారు. సోమవారం స్థానిక కోర్ట్ ప్రాంగణంలో జాతీయ యువజన దినోత్సవం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, యువతే దేశానికి వెన్నెముక అన్నారు. యువత చెడు మార్గం వైపు పయనించకుండా చూడవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. క్రమశిక్షణ గల జీవితాన్ని యువత అలవర్చుకోవాలని, తద్వారా మంచి ఫలితాలు సాధించగలుగుతారన్నారు. అలాగే యువతను ప్రేరేపించడం, పాజిటివ్ దృక్పథం వైపు యువతను తీసుకువెళ్లాలన్నారు. యువతలో ఆత్మవిశ్వాసం, శ్రమ, క్రమశిక్షణ, సామాజిక సేవ మరియు దేశాభిమాన భావనలను పెంపొందించాలన్నారు. స్వామి వివేకానంద జయంతి సందర్భంగా జరుపుకునే నేషనల్ యూత్ డే రోజున యువత ఆయన చూపిన మార్గంలో పయనించాలన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు ఉప్పలపాటి రమేష్ రాజు, లెంక రాంబాబు, కలిశెట్టి రామనాయుడు, సాయి శేఖర్, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

# కోడి బరుల ఏర్పాట్లు తొలగింపు






**సామర్లకోట, (రాజధాని వార్తలు):** కోడిపందాల నిర్వహణపై రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం చేసిన హెచ్చరికలను అనుసరిస్తూ జిల్లా ఎస్పీ బిందు మాధవ్ జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లకు కఠినమైన ఆదేశాలు జారీ చేశారు. దానితో ఎక్కడి కక్కడ కోడిపందాలకు చెక్ పడింది. పెద్దాపురం నియోజకవర్గ పరిధిలోని పెద్దాపురం మండలం గోరింట గ్రామంలో ఎస్ఐ వి మౌనిక ఆధ్వర్యంలోనూ, సామర్లకోట మండలంలోని పనసపాడు గ్రామంలో సీఐ ఏ కృష్ణ భగవాన్ ఆధ్వర్యంలోనూ కోడిపందాల కోసం ఏర్పాటు చేసే బరులను సోమవారం ధ్వంసం చేశారు. కోడిపందాల నిర్వాహకులు పందాలకు భారీగానే ఏర్పాట్లు చేపడుతుండగా వాటిని పోలీసులు రెవెన్యూ అధికారుల సమక్షంలో దుక్కు ట్రాక్టర్ల సహాయంతో ధ్వంసం చేశారు. అలాగే కోడిపందాల పరిసర ప్రాంతాల్లో తినుబండారాల కోసం ఏర్పాటు చేసే దుకాణాల డేరాలను తొలగించారు. ఎక్కడ ఎక్కడ కోడిపందాలు నిర్వహిస్తున్నారో ఆయా ప్రాంతాలను గుర్తించి హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ నిబంధనలు మీరి కోడిపందాలు, జూదాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ, ఎస్ఐలు నిర్వాహకులను హెచ్చరించారు. అయితే ప్రతి ఏటా ఈ తంతు సర్వసాధారణమే అని సంక్రాంతి మూడు రోజులు పాటు అనధికారికంగా కోడిపందాలు, జూధాలు యధాత ధంగా జరుగుతాయని ప్రజలు భావిస్తున్నారు. ఈ క్రమంలో ఈ ఏడాది కోడి పందాల రహిత సంక్రాంతి ఎలా జరుగుతుందో వేచి చూడాల్సిందే.

# సత్య డిగ్రీ, పీజీ కళాశాలలో జాతీయ యువజనోత్సవం




**విజయనగరం, (రాజధాని వార్తలు):** సత్య డిగ్రీ కళాశాలలో స్వామి వివేకానంద జయంతిని జాతీయ యువజన దినోత్సవంగా కళాశాల ఎన్ సి సి మరియు ఎన్ ఎస్ ఎస్ విభాగాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల సంచాలకులు డాక్టర్ ఎం శశి భూషణ రావు, మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ బొత్స అనుష మరియు ప్రిన్సిపల్ డాక్టర్ ఎం వి సాయి దేవమణి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా శశిభూషణ రావు మాట్లాడుతూ, "స్వామి వివేకానందుడు యువతకు ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ మరియు సేవాభావాన్ని బోధించిన మహానుభావుడు. ఆయన బోధనలు నేటి యువతను సరైన దిశలో నడిపించేందుకు మార్గదర్శకాలు యువత తమ లక్ష్యాలను స్పష్టంగా నిర్ణయించుకుని కష్టపడి పనిచేస్తే విజయాలు సొంతమవుతాయి" అని అన్నారు. మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ అనుష మాట్లాడుతూ, "దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉంది. స్వామి వివేకానందుడు చెప్పినట్లు విద్య కేవలం ఉపాధికే కాకుండా జీవితాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దాలి. యువత సామాజిక బాధ్యతను గుర్తించి దేశాభివృద్ధికి తోడ్పడాలి" అని సూచించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, "స్వామి వివేకానందుని ఆశయాలను విద్యార్థులు తమ జీవితాల్లో ఆచరించాలి. నైతిక విలువలు, క్రమశిక్షణ, సేవాభావం కలిసిన విద్యే నిజమైన విద్య. సత్య డిగ్రీ కళాశాల విద్యార్థులను సర్వాంగ అభివృద్ధి సాధించేలా విద్యా- సహపాఠ్య కార్యక్రమాలు నిర్వహిస్తూ ముందుకు సాగుతోంది" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్ సి సి ఆఫీసర్లు కెప్టెన్ ఎం సత్య వేణి, లెఫ్టినెంట్ ఎం ఉదయ్ కిరణ్, ఎన్ ఎస్ ఎస్ ఆఫీసర్ బి సూరప నాయుడు, అధ్యాపకులు, సిబ్బంది మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వివేకానందుని చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమాలు విద్యార్థుల్లో ఉత్తేజం, ప్రేరణ కలిగించాయి.

# సంపాదకీయం

## సిద్ధ శివ కలహ కర్ణాటకం

కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న కర్ణాటకలో ముఖ్యమంత్రి పదవికై కుమ్ములాటలు జరుగుతున్నాయి. తాను నిర్వహిస్తున్న ఆ ఉన్నత పదవిని నిలుపుకునేందుకు ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఆ పదవిని ఆకాంక్షిస్తున్న ఉప ముఖ్యమంత్రి డి.కె శివకుమార్ మధ్య పెరిగిపోతున్న విభేదాల గురించి ఇటీవలి వారాలలో కర్ణాటకలోని వార్తాపత్రికలు అన్నీ పుంఖానుపుంఖాలుగా వార్తలు ప్రచురించాయి. 2023 మేలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పుడు సిద్ధరామయ్య మొదటి రెండు సంవత్సరాలు ముఖ్యమంత్రిగా ఉంటారని, ఆ తరువాత డి.కె. శివకుమార్ ఆ పదవిలోకి వస్తారని కాంగ్రెస్ అధిష్ఠానవర్గం చెప్పినట్టు ఉప ముఖ్యమంత్రి అనుయాయులు గట్టిగా గుర్తు చేస్తున్నారు. ఈ వాదనతో సిద్ధరామయ్య మద్దతుదారులు ఏకీభవించడం లేదు. రెండున్నర సంవత్సరాల గడువు ముగిసిపోయింది. అయినా కాంగ్రెస్ జాతీయ నాయకత్వం మౌనంగా ఉండిపోగా బెంగళూరులో ఉదయం ఉపాహార, మధ్యాహ్న భోజన, రాత్రి విందు సమావేశాలు జోరుగా జరుగుతున్నాయి. శాసనసభ్యుల, కుల సంఘాల నాయకుల మద్దతును తమకు అనుకూలంగా కూడగట్టుకునేందుకు ప్రధాన నాయకులు ఇరువురూ ప్రయత్నిస్తున్నారు. నాయకత్వ వివాదాన్ని దాటి కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరు మొత్తంగా ఎలా ఉందనే విషయాన్ని నిశితంగా పరిశీలించేందుకు ఈ కాలమ్‌ను ఉద్దేశించాను. గత శాసనసభ ఎన్నికల ముందు నెలల్లో కర్ణాటకలో పరిస్థితులు ఎలా ఉన్నాయో తొలుత గుర్తు చేసుకుందాం. అప్పట్లో మీడియాలో అజాన్, హిజాబ్, హలాల్, లవ్ జిహాద్ తదితర అంశాలపై వార్తలే ఎక్కువగా ఉండేవి. అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ ఎప్పటిలాగానే ప్రజల్లో మతపరమైన విభేదాలను రెచ్చగొట్టడం ద్వారా అధికారాన్ని మళ్లీ కైవసం చేసుకునేందుకు ఆరాటపడింది. తమ పాలన తీరుతెన్నులను ప్రజలు హర్షించడం లేదన్న వాస్తవాన్ని గుర్తించి, ముస్లింల పట్ల వ్యతిరేకతను రెచ్చగొట్టడం ద్వారా హిందువులలో మద్దతును కూడగట్టుకుని ఎన్నికలలో విజయం సాధించేందుకు ప్రయత్నించింది. కర్ణాటక అదృష్టం బాగుండి బీజేపీ వ్యూహం విఫలమయింది. కాంగ్రెస్ మంచి మెజారిటీతో విజయం సాధించింది. సిద్ధరామయ్య ముఖ్యమంత్రి అయ్యారు. మతతత్వ ఉద్రిక్తతలను గణనీయంగా తగ్గించడంలో ఆయన ప్రభుత్వం సఫలమయింది. కర్ణాటక జనాభాలో ముస్లింలు 13 శాతం మేరకు ఉన్నారు. క్రైస్తవులు కూడా చెప్పుకోదగిన సంఖ్యలో ఉన్నారు. ఈ రెండు మైనారిటీ మత వర్గాల వారు మే 2023 నుంచి, అంతకు ముందు నెలలు, సంవత్సరాలలో కంటే నిశ్చిత భద్రతాభావంతో మనుగడ సాగిస్తున్నారని నిస్సందేహంగా చెప్పవచ్చు. కర్ణాటకలో కాంగ్రెస్‌ను అధికారానికి తీసుకువచ్చిన అంశాల్లో ముఖ్యమైనవి ఐదు హామీలు: మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం; గృహిణులకు నగదు బదిలీలు; ప్రతి కుటుంబానికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు, అదనపు ఆహార ధాన్యాలు; విద్యావంతులు అయిన నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి. సిద్ధరామయ్య ప్రభుత్వం ఈ హామీలను ఏ మేరకు నెరవేర్చింది? ఈ విషయమై సాధికారికమైన అధ్యయనాలు జరగలేదు. అయితే ఆ హామీ పథకాలు చెప్పుకోదగిన విధంగా విజయవంతమయ్యాయని, లక్షలాది కుటుంబాలకు సామాజిక భద్రత సమకూరిందని స్వతంత్ర పరిశీలకులు ఘంటాపథంగా సూచిస్తున్నారు. మత సామరస్యం, లక్షిత సంక్షేమం అనేవి సిద్ధరామయ్య ప్రభుత్వ విజయాలు అనడంలో సందేహం లేదు. 31 నెలల కాంగ్రెస్ పాలన సాధించిన మరేవైనా విజయాల గురించి చెప్పడం అసాధ్యం కాకపోయినప్పటికీ, కష్టమే. పరిపాలనాపరమైన ఉదాసీనత, అసమర్థత ముఖ్యంగా రాష్ట్ర రాజధాని బెంగళూరులో కనిపిస్తున్నాయి. అధ్వానమైన రోడ్ల పరిస్థితులు, తరచూ ట్రాఫిక్‌జామ్‌లు నగరవాసులకు నరకాన్ని చవి చూపిస్తున్నాయి. భారత్‌లో ఐటీ విప్లవానికి మారుపేరుగా ఉన్న బెంగళూరు నగరంలో ప్రగతి స్తంభించిపోయిందని, మౌలిక సదుపాయాలు క్షీణించిపోతున్నాయని జాతీయ, అంతర్జాతీయ మీడియాలో వ్యాసాలు అనేకం వెలువడ్డాయి. ప్రజల నుంచి తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతుండడంతో బెంగళూరు ఇన్‌చార్జి మంత్రి కూడా అయిన ఉప ముఖ్యమంత్రి డి.కె.శివకుమార్ అంతర్జాతీయ విమానాశ్రయమున్న నగర ఉత్తరప్రాంతం, సాఫ్ట్‌వేర్, బయోటెక్ కంపెనీలు ఉన్న దక్షిణ ప్రాంతం మధ్య ఒక సొరంగ మార్గాన్ని నిర్మించాలని ప్రతిపాదించారు. దీనివల్ల ఇంజినీర్లు తదితర వృత్తి నిపుణులు, వైట్‌కాలర్ ఉద్యోగుల సులభ ప్రయాణాలకు సౌలభ్యమేర్పడడంతో పాటు నగర పౌరులకు ఇతోధిక మేలు జరుగుతుందని ఉప ముఖ్యమంత్రి విశ్వసిస్తున్నారు. అయితే ప్రభుత్వ కార్యక్రమాలలో దేనినైనా 'తెల్ల ఏనుగు' (ప్రభుత్వానికి ఆర్థిక గుదిబండ, ప్రజలకు అల్ప ప్రయోజనమూ కలిగించేది) అని వర్ణించవలసింది ఏదైనా ఉంటే అది ఈ టన్నెల్ ప్రాజెక్టేనని చెప్పి తీరాలి. రవాణా రంగ అగ్రగామి భారతీయ నిపుణులు భారత్ ఉద్దండులు అయిన రవాణా నిపుణులు బెంగళూరులోని సుప్రసిద్ధ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌లో ఉన్నారు. ఉపముఖ్యమంత్రి ప్రతిపాదించిన సొరంగమార్గం ప్రణాళిక వివేకవంతమైనది కాదని, అది ఆచరణయోగ్యం కాదని ఆ నిపుణులు స్పష్టం చేశారు. నగర భూగర్భం చాలా సంక్లిష్టమైనది కావడంతో పాటు ప్రతిపాదిత సొరంగ మార్గం ప్రైవేట్ వాహనాల యజమానులకే ఎక్కువ అనుకూలంగా ఉన్నందున ఆ టన్నెల్ ప్రాజెక్టును చేపట్టక పోవడమే మంచిదని వారు గట్టిగా చెప్పారు. నగర రవాణా సమస్యలకు సరైన పరిష్కారం సిటీ బస్సుల సంఖ్యను ఇతోధికంగా పెంచి ప్రస్తుతమున్న మెట్రో వ్యవస్థతో దానిని సమన్వయం చేయడమేనని ఐఐఎస్ నిపుణులు అభిప్రాయపడ్డారు.

# యునాని డిస్పెన్సరికి శంకుస్థాపన



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** భీమిలి ఆరోగ్య కేంద్రంలో కొత్తగా నిర్మించనున్న యునాని డిస్పెన్సరీ భవనానికి భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సోమవారం శంకుస్థాపన చేశారు. ఏపీ మెడికల్ సర్వీసెస్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ రూ 30 లక్షలతో దీన్ని నిర్మించనుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్లోపతి సహా హోమియోపతి, ఆయుర్వేదం, యునాని తదితర వైద్యాలను ప్రభుత్వం ప్రజలకు అందుబాటులోకి తీసుకు వస్తుందని చెప్పారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. 100 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ నాగేంద్ర, కార్పొరేటర్ గంటా అప్పలకొండ, జడ్పీటీసీ గాదు వెంకటప్పుడు, డాక్టర్ ఫణి కుమార్, డాక్టర్ ప్రతిభ, కూటమి నాయకులు చిక్కాల విజయ్ బాబు, గంటా నూకరాజు, వై.అనిల్ ప్రసాద్, గొలగాని నరేంద్ర, కొప్పల రమేష్, పాసి నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.

# 48వ వార్డులో నూతన వీధి దీపాలతో ప్రజలకు సంక్రాంతి

## దసరా పండుగ తీసుకొచ్చిన గంకల కవిత అప్పారావు యాదవ్



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** గుడ్ మార్నింగ్ గంకల కార్యక్రమంలో వచ్చిన పిర్యాదుతో 48వ వార్డులో నూతన వీధి దీపాలు ఏర్పాటు చేసి గంకల కవిత అప్పారావు కొత్త వెలుగులు నింపి వార్డు అంతటా సంక్రాంతి వెలుగులు నింపారు. గ్రేటర్ విశాఖ 48వ వార్డు పరిధిలో గల కొండ వాలు ప్రాంతంలో 48వ వార్డ్ కార్పొరేటర్, భారతీయ జనతా పార్టీ జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ గంకల కవిత అప్పారావు సోమవారం నాడు వార్డులో గ్రామస్తులతో కలిసి పర్యటన చేసారు. ఈ సందర్భంగా వార్డులో నిర్మాణ దశలో పనులను పరిశీలన చేసి నేరుగా పాల్గొని త్వరిత గతిన అభివృద్ధి పనులు చేయాలనీ, నాణ్యత విషయంలో ఎటువంటి రాజీ లేకుండా నిర్మాణం చేపట్టాలని గుత్తేదారుని కోరారు. వార్డు అంతటా ఎలక్ట్రికల్ డిపార్ట్మెంట్ ఉద్యోగులతో కలిసి కొన్ని చోట్ల వీధి దీపాలు మరమ్మతులు చేపట్టి, అవసరమైన చోట నూతన వీధి దీపాలు ఏర్పాటు చేసారు. ఇందులో భాగంగా వార్డులో పర్యటన చేసి ప్రజల సమస్యలు తెలుసుకుని వార్డు ప్రజల నుంచి పలు ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా గంకల కవిత అప్పారావు మాట్లాడుతూ గుడ్ మార్నింగ్ గంకల కార్యక్రమంలో వార్డు అంతటా ఎలక్ట్రికల్ డిపార్ట్మెంట్ ఉద్యోగులతో కలిసి కొన్ని చోట్ల వీధి దీపాలు మరమ్మతులు చేపట్టి, అవసరమైన చోట నూతన వీధి దీపాలు ఏర్పాటు చేసామన్నారు. 48వ వార్డులో పలుచోట్ల వీధి దీపాలు వెలగడం లేదని తద్వారా ఆకతాయిల ఆగడాలు, చిల్లర దొంగతనాలు ఎక్కువయ్యాయని గుడ్ మార్నింగ్ గంకల కార్యక్రమంలో ఫిర్యాదు చేశారని ఫిర్యాదు పై గతంలో జీవీఎంసీ కమిషనర్ కు ఫిర్యాదు చేసి కౌన్సిల్ లో చర్చించడం కూడా జరిగిందని, అంతేకాకుండా ఈ విషయంపై గత వారంలో ఎలక్ట్రికల్ ఏఈ విజయతో కలిసి పర్యటన చేసి తక్షణమే సమస్య పరిష్కారం చూపాలని కోరడమైనదని, ఈ విషయంపై అధికారులతో కలిసి ఈరోజు నూతన వీధి దీపాలు ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ నూతన వీధి దీపాలతో ఆకతాయి ఆగడాలు అరికట్టవచ్చని సంక్రాంతి పండుగలు నేపథ్యంలో ఊర్లు వెళ్లే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చీకటి ప్రదేశం నెలకొంటే దొంగతనాలు జరిగే అవకాశం ఉందని వీధి దీపాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. వార్డ్ ప్రజలకు ఎటువంటి సమస్య ఏర్పడిన తక్షణమే తనను సంప్రదించాలని ఈ సందర్భంగా వార్డు ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. వార్డ్ ప్రజలు పిర్యాదు పట్ల, అభివృద్ధి కార్యక్రమాల పట్ల మహిళ కార్పొరేటర్‌గా ముందుకు వచ్చి అభివృద్ధి పనులకు చర్యలు చేపట్టి, దశాబ్దాల కాలం నుంచి నోచుకోని వార్డులో గల నూతన రోడ్లు, కాలువలు, మెట్లు నిర్మాణలు, వీధి దీపాలు ఏర్పాట్లు చేపట్టి, నిరంతరం శ్రమిస్తున్న వార్డ్ కార్పొరేటర్ గంకల కవిత అప్పారావు యాదవ్ కృషి పట్ల గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

# ప్రత్యామ్నాయ కన్స్యూమర్ వివాద పరిష్కారంలో సిఆర్సి మైలురాయి

**- సిఆర్సి జాతీయ అధ్యక్షులు డాక్టర్ వికాస్ పాండే వెల్లడి - తొలిసారిగా 12 మంది సిఆర్సి సభ్యులకు మధ్యవర్తిత్వ న్యాయ పరిష్కార శిక్షణ - సర్టిఫికెట్లు బహుకరించిన పోలీస్ కమిషనర్, కన్స్యూమర్ కోర్టు న్యాయమూర్తి**









**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** ప్రత్యామ్నాయ వివాద పరిష్కార రంగంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం చారిత్రాత్మక మైలురాయిని కన్స్యూమర్ రైట్స్ కౌన్సిల్ (సిఆర్సి) సాధించింది. ఈ కార్యక్రమం రాష్ట్రంలో మధ్యవర్తిత్వ, వినియోగదారుల న్యాయం వ్యవస్థలను బలపరచే కీలక అడుగుగా నిలిచింది. కన్స్యూమర్ రైట్స్ కౌన్సిల్ (సిఆర్సి) జాతీయ అధ్యక్షులు డాక్టర్ వికాస్ పాండే బృందం 12 మంది సభ్యులతో ఆంధ్రప్రదేశ్‌లో అధికారికంగా శిక్షణ పొందిన తొలి మధ్యవర్తులుగా గుర్తింపు పొందారు. తొలి సారిగా విశాఖ నగరంలో డాల్ఫిన్ హోటల్ సమావేశ మంది రంలో నిర్వహించిన ఈ మధ్యవర్తిత్వ శిక్షణ కార్యక్రమం కన్స్యూ మర్ రైట్స్ కౌన్సిల్, ఐఏఎంసి సహకారంతో నిర్వహించారు. శిక్షణను అంతర్జాతీయ స్థాయి ఆర్బిట్రేటర్, మధ్యవర్తి నిపుణులు ఎ.జె.జవాద్, వారి నిపుణుల బృందం శిక్షణ సమగ్రంగా అందించారు. సర్టిఫికెట్ ప్రదానోత్సవ వాలెడిక్టరీ సెరిమనీ ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి హాజరైన ముఖ్య అతిధులుగా విశాఖపట్నం అదనపు జిల్లా న్యాయమూర్తి, పోలీస్ కమిషనర్, డిజిపి డాక్టర్ శంఖ్ బ్రత బాగ్చీ, జిల్లా వినియోగదారుల కోర్టు న్యాయమూర్తి డాక్టర్ జి. తనూజ హాజరయ్యారు. కన్స్యూమర్ కేసుల్లో మధ్యవర్తి వహించే విధంగా సభ్యులకు శిక్షణ ఇచ్చిన అంతర్జాతీయ స్థాయి ఆర్బిట్రేటర్, మధ్యవర్తి నిపుణులు ఎ. జె. జవాద్‌కి డాక్టర్ వికాస్ పాండే తన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రజల వివాదాలను ఉచిత మధ్యవర్తిత్వ సేవల ద్వారా పరిష్కరించేందుకు తమ బృందం కట్టుబడి ఉందని తెలిపారు.

ఇది శాంతియుత, వేగవంతమైన తక్కువ ఖర్చుతో వివాద పరిష్కారానికి దోహదం చేస్తుందన్నారు. ఉచిత లీగల్ కన్సల్టేషన్ కోసం 99636 33653 నంబర్‌కు కాల్ చేయవచ్చునన్నారు. www.crcbharat.com వెబ్‌సైట్‌లో సందేహాలు, ఫిర్యాదులు రిజిస్టర్ చేసుకోవచ్చునన్నారు. ఈ శిక్షణలో మధ్యవర్తిత్వానికి సంబంధించిన సిద్ధాంతం, ప్రాయోగిక అంశా లపై లోతైన అవగాహన కల్పించబడింది. శిక్షణ పొందిన సభ్యులు అడ్వకేట్ డాక్టర్. ఆర్.శ్రీరాములు, డాక్టర్. త్రినాధ్ అడ్వకేట్ సుకన్య ప్రియ, డాక్టర్. దొడ్డి చంద్రశేఖర్, శరత్ చంద్ర, కె.అవి నాష్ శంకర్, అడ్వకేట్ దివ్య భారతి,ముజీర్ అడ్వకేట్ రాజేంద్ర ప్రసాద్, రామకృష్ణ జీ షంవీర్ చౌహాన్ కు సర్టిఫికెట్ ప్రదానో త్సవం విశాఖ నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖ్ బ్రత బాగ్చీ, వినియోగదారుల కోర్టు న్యాయమూర్తి డాక్టర్ జి. తనూజ చేతుల మీదుగా నిర్వహించారు.

# కళ్యాణ మండప నిర్మాణంలో లోపాన్ని కౌన్సిల్లో చర్చించాలి




**సామర్లకోట, (రాజధాని వార్తలు):** సామర్లకోటలో బలుసులపేటలో నిర్మిస్తున్న డా. అంభేడ్కర్ కల్యాణ మండపం చాలా చిన్నదిగా వున్నదని ముందుగా చెప్పిన విధంగా కళ్యాణ మండప పనులు చేపట్టేందుకు మున్సిపల్ కౌన్సిల్ సమావే శంలో ఈ అంశంపై చర్చించి నిర్ణయం తీసుకోవాలని 13, 14 వార్డులకు చెందిన ప్రజలు మున్సిపల్ కౌన్సిలర్ నేతల హరిబాబు ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 12, 13 వార్డుల్లో ఏ శుభాకార్యం జరిగినా సూమరు 600-1000 మంది ప్రజలు హాజరావుతారన్నారు. జనభా ఏక్కువ ఉన్న కారణంగా బేస్మెంట్ పెంచి కట్టాలి అని కౌన్సిల్ అజెండాలో జరనల్ ఫండ్ పెట్టి మరో రూ. 10 లక్షలు ఇప్పిస్తే అవిధంగా కొలతతో సరిపోతుందన్నారు. ఈ మీటింగ్ ఈ అంశాన్ని సామర్లకోట చైర్పర్సన్‌కు చెప్పి అంశన్ని కౌన్సిల్ మీటింగ్‌లో తీసుకు రావలసిందిగా ఆ ప్రాంత ప్రజలు కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కుక్కల అప్పారావు, తుంపు మహేష్, నొక్కు రావణ, బన్ను, వాకపల్లి నాని బాబు తదిదరులు పాల్గొన్నారు.

# "ఈ గ్రామ స్వరాజ్" పై కార్యదర్శులకు శిక్షణ



**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** మేరీ పంచాయత్-మేరీ ధారోహరు కార్యక్రమంపై వర్చ్యువల్ శిక్షణ కార్యక్రమం పెద్దాపురం మండలంలో గ్రేడ్ 1 నుండి 6 వరకు గల అందరు పంచాయతీ కార్యదర్శులకు పెద్దాపురం మండల పరిషత్ కార్యా లయంలో శిక్షణా కార్యక్రమం జరిగింది. దీనిలో ఎంపిడివో కెవి సూర్యనారాయణ మాట్లాడుతూ మండల పరిధిలోని ఉన్న గ్రామముల వారసత్వ సంపద వివరాలు, ఆయా గ్రామాలకు ఉన్న పేర్లు, అవి ఎలా వచ్చినవి, ఆయా గ్రామములలో ఉన్న ఆచార వ్యవహారములు, కట్టుబాట్లు, జాతరలు, పండుగలు మొదలగు వివరాలపై ఈ నెల 26న గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి గ్రామ ప్రజల ఆమోదంతో "ఈ-గ్రామ స్వరాజ్ పోర్టల్ నందు తీర్మానములు, ఫోటోలు అప్లోడ్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఉప మండల పరిషత్ అభివృద్ధి అధికారి జివి శేఖర్ రెడ్డి, మండల జి ఎస్ డబ్ల్యూ ఎస్ అధికారి వై శ్రీహరి పాల్గొన్నారు.

# వాకనాటిచే వెంకటేశ్వర స్వామి దశావతార ప్రవచనాలు



**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** పెద్దాపురం పట్టణంలో వేంచేసి ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రవచన కేసరి వాకనాటి శేషగిరిచే రెండవ రోజు ప్రవచన కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. వెంకటేశ్వర స్వామి దశావతార ఉత్సవాల్లో భాగంగా ఆలయ కార్యనిర్వహణ అధికారి జగదీశ్వరరావు, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జల్లూరి వీర్రాజుల ఆధ్వర్యంలో స్వామివారి దశావ తారాలపై ప్రవచనకర్త శేషగిరి అందించిన ప్రవచ నాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. అలాగే దశావతార ఉత్సవాల్లో భాగంగా సోమవారం వెంకటేశ్వర స్వామికి ఆలయ అధికారులు అర్చకుల ఆధ్వర్యంలో విశేష పూజలు చేపట్టి భక్తులకు ప్రత్యేక ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా ప్రవచనకర్త శేషగిరిని ఆలయ అధికారి, ధర్మకర్తల మండలి చైర్మన్లు ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

# బాక్సాఫీస్ వద్ద మెగా 'ర్యాంపేజ్'.. టికెట్ల వేటలో సరికొత్త రికార్డ్




సంక్రాంతి రేసులో మెగాస్టార్ చిరంజీవి తన బాక్సాఫీస్ పవర్ ఏంటో మరోసారి నిరూపిస్తున్నారు. అనిల్ రావిపూడి డైరెక్షన్‌లో వచ్చిన 'మన శంకర వరప్రసాద్ గారు' సినిమా థియేటర్ల వద్ద కాసుల వర్షం కురిపిస్తోంది. మెగాస్టార్‌ను వింటేజ్ లుక్‌లో చూడాలని ఎప్పటి నుంచో వెయిట్ చేస్తున్న ఆడియన్స్‌కు ఈ సినిమా ఫుల్ మీల్స్‌లాంటి కిక్కిస్తోంది. కేవలం మాస్ ప్రేక్షకులే కాకుండా, ఫ్యామిలీ ఆడియన్స్ కూడా భారీగా థియేటర్లకు క్యూ కడుతుండటంతో బాక్సాఫీస్ లెక్కలు మారుతున్నాయి. ంశ్రీబనీ ఖీవజీట – స్టార్ హీరోకి కలిసిరాని కొత్త ఏడాది ఆరంభం.. డైరెక్టర్ అనిల్ రావిపూడి ఈ సినిమా విషయంలో ఇచ్చిన ప్రతి ప్రామిస్‌ను నిలబెట్టుకున్నారని చెప్పాలి. గత కొన్ని సినిమాల్లో మెగాస్టార్ నుంచి ఆడియన్స్ ఏదైతే మిస్ అయ్యారో, వాటన్నింటినీ ఈ సినిమాలో పక్కాగా ప్రజెంట్ చేశారు. ముఖ్యంగా బాస్ కామెడీ టైమింగ్, డ్యాన్సులు ఫ్యాన్స్‌కు పూనకాలు తెప్పిస్తున్నాయి. ఈ సినిమా ఇటు క్లాస్, అటు మాస్ ప్రేక్షకులను ఒకేలా అలరిస్తుండటంతో వసూళ్లలో నిలకడ కనిపిస్తోంది. ఇక అసలు విషయానికి వస్తే, 'మన శంకర వరప్రసాద్ గారు' బాక్సాఫీస్ వద్ద రికార్డులను తిరగ రాస్తోంది. బుక్ మై షో ప్లాట్‌ఫారమ్‌లో ఈ సినిమా ఇప్పటికే 1 మిలియన్‌కు పైగా టికెట్ల సేల్స్‌ను నమోదు చేసి సెన్సేషన్ క్రియేట్ చేసింది. కేవలం ఒకట్రెండు రోజుల్లోనే ఈ స్థాయిలో టికెట్లు అమ్ముడయ్యాయంటే బాస్ క్రేజ్ ఏ రేంజ్‌లో ఉందో అర్థం చేసుకోవచ్చు. పండుగ సెలవులు ఇంకా ముందే ఉండటంతో ఈ టికెట్ల వేట మరింత పెరిగే అవకాశం ఉంది. ఈ సినిమాకు వస్తున్న ఆదరణ చూస్తుంటే చిరంజీవి కెరీర్‌లోనే ఇది ఒక బిగ్గెస్ట్ హిట్‌గా నిలిచేలా కనిపిస్తోంది. మొదటి రోజే ప్రపంచవ్యాప్తంగా 84 కోట్లకు పైగా గ్రాస్ వసూలు చేసి మెగాస్టార్ కెరీర్‌లోనే హయ్యెస్ట్ ఓపెనింగ్ డే కలెక్షన్లను రాబట్టింది.

ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ జోనర్‌లో వచ్చి కూడా ఈ స్థాయిలో వసూళ్లు సాధించడం అందరినీ ఆశ్చర్యపరు స్తోంది. సంక్రాంతి సీజన్‌ను బాస్ తన కలెక్షన్లతో ఫుల్‌గా వాడేసుకుంటున్నారని ట్రేడ్ వర్గాల సమాచారం. సాహు గారపాటి, సుస్మిత కొణిదెల సంయుక్తంగా నిర్మించిన ఈ సినిమాలో విక్టరీ వెంకటేష్ గెస్ట్ రోల్, నయనతార హీరోయిన్‌గా నటించడం సినిమాకు అదనపు బలాన్ని ఇచ్చాయి. మెగాస్టార్ వెంకటేష్ కాంబినేషన్ సీన్లు థియేటర్లలో నవ్వుల హంగామాను సృష్టిస్తున్నాయి. ఫ్యామిలీ అందరూ కలిసి హ్యాపీగా ఎంజాయ్ చేసేలా అనిల్ రావిపూడి ఈ స్క్రిప్ట్‌ను డిజైన్ చేయడంలో సక్సెస్ అయ్యారు. రేపటి నుంచి పండుగ సెలవులు అధికారికంగా ప్రారంభమవుతుండటంతో బాక్సాఫీస్ దగ్గర 'ఎంఎస్‌జి' జోరు ఇంకా పెరగనుంది. ప్రస్తుతం ఉన్న ట్రెండ్ చూస్తుంటే, ఇతర సినిమాల పోటీని తట్టుకుని ఈ మెగా ఎంటర్‌టైనర్ రికార్డు స్థాయి వసూళ్లను సాధించడం ఖాయంగా కనిపిస్తోంది. పండుగ ముగిసేసరికి ఈ సినిమా ఫైనల్ వసూళ్ల లెక్కలు ఏ రేంజ్‌లో ఉంటాయో చూడాలి.

# 'కల్కి 2'కి ముహూర్తం పెట్టేసారా?



ఒకేసారి రెండు..మూడు ప్రాజెక్ట్‌లు పట్టాలెక్కించడం ప్రభాస్ ప్రత్యేకత. ఏక కాలంలో వాటి షూటింగ్స్‌లో పాల్గొన డంలోనూ డార్లింగ్ అంతే ఘనుడు. గత ఏడాది 'రాసాజాబ్', 'ఫౌజీ' షూటింగ్‌లతో బిజీగా గడిపాడు. ఎట్టకేలకు రాజాసాబ్ అన్ని అవాంతరాలు దాటుకుని 9న రిలీజ్ అయిపోయింది. ఆ సినిమా ఫలితం సంగతి పక్కన బెడితే ప్రభాస్ మెరుపు వేగంగా షూటింగ్ పూర్తి చేయాల్సిన ప్రాజెక్ట్ లున్నాయి. ఇప్పటికే 'ఫౌజీ' షూటింగ్ చాలా వరకూ పూర్తయింది. భారీ పీరియాడిక్ చిత్రం కావడంతో రాజాసాబ్‌ని పక్కనబెట్టి మరీ 'ఫౌజీ' షూటింగ్‌కి హాజరయ్యాడు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్‌కి బ్రేక్ ఇచ్చి సందీప్ రెడ్డి వంగా ప్రాజెక్ట్ 'స్పిరిట్'ని పట్టాలెక్కించాడు. 'రాజాసాబ్' ప్రచారం అనంతరం డార్లింగ్ విదేశాలకు వెకేషన్ కు వెళ్లాడు. మరో రెండు..మూడు రోజుల్లో తిరిగి రానున్నాడు. సంక్రాంతి సెలవుల అనంతరం తిరిగి 'స్పిరిట్' షూటింగ్‌లో పాల్గొంటాడు. ప్రస్తుతం సందీప్ ప్రభాస్ లేని సన్నివేశాలను చిత్రీకరిస్తున్నాడు. ఈ నేపథ్యంలోనే 'కల్కి 2' అప్‌డేట్ కూడా తెరపైకి వస్తోంది. ఈ సినిమా షూటింగ్ ఫిబ్రవరి ముగింపు లేదా మార్చి తొలి వారంలో మొదలు పెట్టాలని దర్శకుడు నాగ్ అశ్విన్ భావిస్తున్నాడుట ప్రభాస్ లేకుండానే షూట్ ప్లాన్ చేస్తున్నారుట. ప్రభాస్ 'కల్కి 2' లో జాయిన్ అవ్వడానికి మరో రెండు మూడు నెలలైనా సమయం పడుతుందని సమాచారం. ఈలోగా ప్రభాస్ లేని సన్నివేశాలు పూర్తి చేయాలన్ని నాగీ ప్లాన్ కావొచ్చు. ఇలా చేయగలిగితే సమయం చాలా వరకూ కలిసొస్తుంది. ప్రభాస్ వచ్చిన తర్వాతే అన్ని పనులు ఒకేసారి చేయడం కంటే ముందుగానే మొదలు పెట్టి ప్రభాస్ లేని ప్రధాన నటులపై కీలక సన్నివేశాలు పూర్తి చేయోచ్చు. 'స్పిరిట్' షూటింగ్ కూడా సందీప్ రెడ్డి వేగంగానే పూర్తి చేస్తాడనే ప్రచారం జరుగుతోంది. 90 లేదా 120 రోజుల్లోనే 'స్పిరిట్' షూటింగ్ పూర్తి చేయాలని సందీప్ ముందు కెళ్తున్నాడు.

ఈ నేపథ్యంలోనే నాగీ 'కల్కి 2' తెరపైకి తెస్తున్నట్లు కనిపిస్తోంది. 'ఫౌజీ' షూటింగ్ కోసం ప్రభాస్ ఎన్ని రోజులు కేటాయించాల్సి ఉంటుంది? అన్న దానిపై ఓ క్లారిటీ వస్తే మిగతా షూటింగ్ డేస్‌పై మేకర్స్ ఓ అంచనాకి రావొచ్చు. రాజాసాబ్ కోసం లుక్‌లో మార్పులు తెచ్చినా మళ్లీ పాత లుక్ లోకి వెళ్లిపోయాడని రాజాసాబ్ ప్రీ రిలీజ్ ఈవెంట్ పిక్స్‌తో తేలిపోయింది. ఈ నేపథ్యంలో 'ఫౌజీ', 'స్పిరిట్', 'కల్కి 2' కోసం లుక్ పరంగా పెద్దగా ఛేంజస్ కూడా లేనట్లే కనిపిస్తోంది. అలాంటి మార్పులుంటే ఒకేసారి మూడు సినిమా షూటింగ్‌లు పూర్తి చేయడం అసాధ్యమే.

# గ్లామర్‌తో హీటెక్కిస్తున్న గ్లోబల్ స్టార్!



గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా ఎప్పటికప్పుడు తన నటన తోనే కాదు అందంతో కూడా ఆడియన్స్‌ను ఆకట్టుకుంటూ ఉంటుంది. ఇటీవల గోల్డెన్ గ్లోబ్ అవార్డ్స్ వేడుకల్లో సందడి చేసిన ఈ ముద్దుగుమ్మ.. తాజాగా తన ఇన్‌స్టాగ్రామ్ వేదికగా కొన్ని ఫోటోలను పంచుకుంది. ఇప్పటివరకు గోల్డెన్ గ్లోబ్ అవార్డ్స్ వేదికపై తన భర్త నిక్ జోనస్‌తో కలిసి సందడి చేసిన ఈమె.. తాజాగా క్రీమ్ కలర్ డ్రెస్ ధరించి అందాలు ఆరబోస్తూ అభిమానులను ఉక్కిరిబిక్కిరి చేసింది. మరొకసారి తన భర్తతో కలిసి ఫోటోలకు ఫోజులిచ్చింది ఈ ముద్దుగుమ్మ. ఈ ఫోటోలు చూసిన అభిమానులు గ్లామర్‌తో ఇంకెంత హీటెక్కిస్తావ్ అంటూ కామెంట్లు చేస్తున్నారు. ఇకపోతే ఇక్కడ తన భర్త నిక్ జోనస్‌తో కలిసి దిగిన ఫోటోలు అభిమానులను విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. అమ్మడి అందానికి ఫిదా అవుతున్నారు అభిమానులు. అంతేకాదు పలు రకాల కామెంట్లతో కామెంట్ బాక్స్ నింపేస్తున్నారు.. మొత్తానికైతే గోల్డెన్ గ్లోబ్ అవార్డ్స్ ఈవెంట్ తర్వాత ప్రియాంక చోప్రా షేర్ చేసిన ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారుతున్నాయి. ప్రియాంక చోప్రా ప్రస్తుతం తెలుగులో చేస్తున్న చిత్రం వారణాసి. లెజెండ్రీ దిగ్గజ దర్శకుడు రాజమౌళి దర్శకత్వంలో సూపర్ స్టార్ మహేష్ బాబు హీరోగా నటిస్తున్న చిత్రం ఇది. ఆఫ్రికన్ అడవులలో యాక్షన్ అడ్వెంచర్ మూవీగా రాబోతున్న ఈ చిత్రంలో మలయాళ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్ర పోషిస్తున్నారు. అంతేకాదు ఈ సినిమాలో ప్రకాష్ రాజ్ మరోసారి మహేష్ బాబుకు తండ్రిగా నటిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో మందాకిని అనే పవర్ఫుల్ పాత్రలో ప్రియాంక చోప్రా నటిస్తోంది. ఇప్పటికే ఈ సినిమా నుండి ఈమె ఫస్ట్ లుక్ పోస్టర్‌ను కూడా మేకర్స్ రిలీజ్ చేసిన విషయం తెలిసిందే. అందులో చీర కట్టుకొని చేతిలో గన్ను పట్టుకొని యాక్షన్ పెర్ఫార్మెన్స్‌తో అందరినీ ఆకట్టుకుంది ఈ ముద్దుగుమ్మ. నటిగా కొనసాగుతున్న ఈమె.. 2000 సంవత్సరంలో ప్రపంచ సుందరి కిరీటాన్ని దక్కించుకుంది. ఆ తర్వాతే సినిమాలలో అవకాశాలు లభించాయి. అలా తొలిసారి 2002లో తమిళ చిత్రం తమిళన్ ద్వారా ప్రేక్షకులకు పరిచయమైంది ఈ ముద్దుగుమ్మ. ఆ తర్వాత అనిల్ శర్మ దర్శకత్వంలో ది హీరో: లవ్ స్టోరీ ఆఫ్ స్పై అనే చిత్రం ద్వారా 2003లో హిందీ రంగ ప్రవేశం చేసింది. ఇక ఇప్పటినుంచి బాలీవుడ్‌లోనే సినిమాలు చేస్తూ ప్రేక్షకులను ఆకట్టుకున్న ఈమె అక్కడ అవకాశాలు కరువవడంతో హాలీవుడ్‌కి వెళ్ళిపోయింది. అక్కడే పలు చిత్రాలు , వెబ్ సిరీస్‌లు చేస్తూ భారీ పాపులారిటీ సొంతం చేసుకుంది. అంతేకాదు ఏకంగా ఒక్కో చిత్రానికి 45 కోట్ల రెమ్యూనరేషన్ తీసుకుంటూ అందరిని ఆశ్చర్యపరుస్తోంది. ఒక రకంగా చెప్పాలి అంటే ఇండియన్ బాక్సాఫీస్ వద్ద అత్యధిక రెమ్యూనరేషన్ తీసుకుంటున్న హీరోయిన్గా కూడా ప్రియాంక చోప్రా పేరు దక్కించుకుంది.

# నేచురల్ స్టార్‌ని లైన్‌లో పెడుతోన్న క్లాసిక్ డైరెక్టర్



నేచురల్ స్టార్ నాని ఫుల్ స్వింగ్‌లో ఉన్నాడు. వరుస విజయాలతో దూసుకుపోతున్నాడు. పట్టిందల్లా బంగారమే అవుతుందన్నట్లు ఉంది సన్నివేశం. 'దసరా' నుంచి వరుసగా అన్నీ విజయాలే ఖాతాలో నమోదవుతు న్నాయి. 'హాయ్ నాన్న', 'సరిపోదా శనివారం', 'హిట్ ది థర్డ్ కేస్'తో బ్యాక్ టూ బ్యాక్ సక్సెస్‌లు అందుకున్నాడు. దీంతో నాని తదుపరి చిత్రాల లైనప్ కూడా అంతే స్ట్రాంగ్ ఉంది. ప్రస్తుతం 'దసరా' ఫేం శ్రీకాంత్ ఓదెలతో 'ది ప్యారడైజ్' చేస్తున్నాడు. ఈ చిత్రాన్ని నేరుగా పాన్ ఇండియాతో పాటు వరల్డ్ కే కనెక్ట్ చేయాలని ప్లాన్ చేసారు. అదెంత వరకూ సాధ్యమవుతుంది? అన్నది చూడాలి. ఇప్పటికే రిలీజ్ అయిన ప్రచార చిత్రాలతో సినిమాపై అంచనాలు భారీ ఏర్పడ్డాయి. దీనికి తగ్గట్టు తదుపరి సినిమాని కూడా నాని సెట్ చేసి పెట్టాడు. 'సాహో', 'ఓజీ'లతో పాన్ ఇండియా డైరెక్టర్‌గా వెలిగిపోతుతున్న సుజిత్‌ని లైన్‌లోకి తీసుకున్నాడు. ఇద్దరు కలిసి 'బ్లడీ రోమియో' అంటూ ఓ సినిమాకు రెడీ అవుతున్నారు. 'ది ప్యారడైజ్' తర్వాత పట్టాలెక్కేది ఆ చిత్రమే. అయితే ఈ ప్రాజెక్ట్ అనంతరం యంగ్ మేకర్ కిషోర్ తిరుమల నానిని తన ప్రాజెక్ట్ కోసం లాక్ చేసే ప్రయత్నాల్లో ఉన్నాడు. ఇప్పటికే నానికి సుబ్రమణ్యస్వామి నేపథ్యంలో ఓ స్టోరీ నేరేట్ చేసాడు. కానీ నాని ఒకే చెప్పాడా? లేదా? అన్నది మాత్రం రివీల్ చేయలేదు. ఒకవేళ ఈస్టోరీ రిజెక్ట్ చేసినా మరో స్టోరీతో మెప్పించడానికి రెడీగా ఉన్నాడు. 'మున్నాభాయ్' అనే సెటైరికల్ స్క్రిప్ట్‌ని సిద్ధం చేసి పెట్టాడు. ఆ స్టోరీతోనైనా నాని లాక్ చేసే ఆలోచనలో ఉన్నాడు. అలాగే నాని ఉన్న బిజీలో డేట్లు ఇస్తాడా? లేదా? అన్న సందేహం కూడా కిషోర్ మాటల్లో కనిపిస్తుంది. నాని డేట్లు ఇస్తే ఈ రెండు కథల్లో ఏదో ఒకటి తనతో తీస్తానన్నాడు. ఒకవేళ నాని తో కుదరకపోతే మరో హీరోతోనైనా ఇవే కథలు తీసేలా రెడీ అవుతున్నాడు. కిషోర్ తిరుమల కూడా హీరోల ఇమేజ్ ఆధారంగా స్టోరీ సిద్ధం చేయడు. స్టోరీ రాసిన తర్వాత ఆ కథకు ఏ హీరో సెట్ అవుతాడో చూసుకుంటాడు. అతడితో వీలు కాకపోతే మరో హీరోతోనైనా అడ్జస్ట్ అవుతాడని తెలుస్తోంది. ప్రస్తుతం కిషోర్ తిరుమల 'భర్తమహాశయులకు విజ్ఞప్తి' అంటూ ఓ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. ఇందులో రవితేజ హీరోగా నటించాడు. ఈ సినిమా ప్రచారంలో కిషోర్ బిజీగా ఉన్నాడు.

# మన్నేటికోటలో వైభవంగా విపిఆర్ అమృత ధార వాటర్ ప్లాంట్ ప్రారంభోత్సవం

**- ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎంఎల్ఏ ఇంటూరి నాగేశ్వరరావు**
**- ప్రజాసేవే విపిఆర్ ఫౌండేషన్ లక్ష్యం - ఉలవపాడు మండలంలో రెండో వాటర్ ప్లాంట్ ప్రారంభం**







**నెల్లూరు, (రాజధాని వార్తలు):** పేదల దాహార్తి తీర్చే లక్ష్యంగా నెల్లూరు పార్లమెంట్ సభ్యుడు ప్రభాకర్ రెడ్డి విపిఆర్ అమృత ధార వాటర్ ప్లాంట్ లు గ్రామీణ ప్రజల గొంతు తడుపుతున్నాయి. సోమవారం ఉలవపాడు మండలం, మన్నేటికోటలో ఏర్పాటు చేసిన విపిఆర్ అమృత ధార వాటర్ ప్లాంట్ ప్రారంభోత్సవానికి నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తదితరులు హాజరయ్యారు. ముందుగా గ్రామానికి చేరుకున్న ఎంపీ, ఎమ్మెల్యేకు మన్నెటి కోట నాయకులు కార్యకర్తలు అపూర్వ స్వాగతం పలికారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన విపిఆర్ అమృతధార వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ 2017లో విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వ ర్యంలో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌లు ఇప్పటికీ అద్భుతంగా పనిచేస్తున్నాయన్నారు. అలాగే ఇటీవల విపిఆర్ నేత్ర ద్వారా ప్రజలకు కంటి పరీక్షలు ఉచితంగా చేయిస్తూ కంటి అద్దాలు అందజేస్తున్నామన్నారు. కందుకూరు నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు కూడా సేవలు అందిస్తామన్నారు. ఉలవపాడు మండలంలో ఇది రెండవ ప్లాంటని చెప్పారు. దివ్యాంగులకు ట్రై సైకిల్స్ అందించి వారిలో ఆత్మవిశ్వాసం నింపామని చెప్పారు. ఈ సందర్భంగా గ్రామంలో ఉన్న వృద్ధులను ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఆప్యాయంగా పలకరించారు. ప్రభుత్వం నుంచి అందుతున్న లబ్దిని తెలుసుకున్నారు.

1వ తేదీనే పింఛను అం దిస్తూ ఆదుకుంటుందని చెప్పారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన సిమెంట్ రోడ్లు ప్రారంభించారు. గ్రామంలో ఎప్పటినుంచో నీటి వసతి సరిగా లేక ఇబ్బందులు పడుతున్నామని, నేడు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి సహకారంతో విపిఆర్ అమృత ధార ప్లాంట్ ఏర్పాటు అయిందనీ గ్రామస్తులు అన్నారు. ఈ సంద ర్భంగా వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు శివ, మన్నేటికోట సర్పంచ్ బసవ య్య, టిడిపి నాయకులు కేతంరెడ్డి వినోద్ రెడ్డి, గుడి హరి రెడ్డి, ఇతర నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# జ్ఞాన సరస్వతీ ఆలయంలో అవకతవకలు... ఆలస్యంగా వెలుగులోకి..



**నిర్మల్, (రాజధాని వార్తలు):** ప్రముఖ పుణ్యక్షేత్రమైన బాసర జ్ఞాన సరస్వతీ దేవి ఆలయంలో ఆర్థిక అక్రమాలు, అవకతవకలపై విజిలెన్స్ బృందం దృష్టి సారించింది. ఆలయంలో భక్తుల నుంచి సేకరించే హుండీ ఆదాయం, దాన ధర్మాలు, పూజలు, ప్రసాదాలు వంటి ఆర్థిక లావాదేవీలను గోప్యంగా పరిశీలించిన విజిలెన్స్ బృందం, పలు విభాగాల్లో అవకతవకలు జరుగుతున్నట్లు ప్రాథమికంగా నిర్ధారించింది. సాధారణ భక్తుల రూపంలో ఆలయంలోకి వచ్చిన విజిలెన్స్ అధికారులు.. ఆలయ సిబ్బంది ఆర్థిక వ్యవహారాలు, రికార్డులు, లావాదేవీలను పరిశీలించారు. ఈ విచారణ గత కొన్ని రోజులుగా గోప్యంగా జరిగినట్లు తెలుస్తోంది. ఇప్పుడు ఈ అంశం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ అంశాలపై విజిలెన్స్ బృందం లోతుగా దర్యాప్తు చేపట్టింది. రెండు రోజుల్లో పూర్తి వివరాలతో కూడిన నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించనుంది. ఈ నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకునే అవకాశం ఉన్నట్లు సమాచారం. కాగా.. బాసర సరస్వతీ దేవి ఆలయం దేశంలోనే ప్రసిద్ధ సరస్వతీ దేవాలయాల్లో ఒకటిగా పేరుపొందింది. జ్ఞానాన్ని, విద్యను ప్రసాదించే సరస్వతీదేవి సన్నిధిలో చిన్నారులకు అక్షరాభ్యాసం చేస్తే వారికి చదువు బాగా అబ్బుతుందని, భవిష్యత్తులో గొప్ప ప్రయోజకులు అవుతారని భక్తుల విశ్వాసం. తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా దేశ విదేశాల నుంచి కూడా భక్తులు సరస్వతీ దేవిని దర్శించుకోవడానికి వస్తుంటారు. ఇలాంటి పవిత్ర క్షేత్రంలో అక్రమాలు జరుగుతున్నాయనే విషయం భక్తుల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తోంది.

# రైతులకు అందని యూరియా

**- నేను చెప్పిన వారికే యూరియా ఇవ్వాలంటూ ఓ రాజకీయ కధర్ చౌక్కా**
**- యూరియా కోసం నాలుగు గంటలు పడిగాపు కాస్తున్న రైతాంగం**

**డక్కిలి, (రాజధాని వార్తలు):** తిరుపతి జిల్లా డక్కిలి మండలం సదరు పంచాయితీ సొసైటీ నందు రైతులు యూరియా కోసం పడి కాపు కాస్తున్న కథనం రోజు రోజుకు రైతులను కలవరి పెడుతుంది. మేము చెప్పిన వారికే యూరియా ఇవ్వాలంటూ ఓ రాజకీయ కధర్ చౌక్కా మండలంలో కొస మెరుపులు. రైతుల పట్ల రాజకీయ వివక్షత సరికాదని,రైతులకు యూరియా అందేలా సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులు చొరవ తీసుకోవాలని, రైతుల కష్టాలను, వారి మోరని ఆలకించి రైతే రాజు అనే పదానికి కనీస గౌరవం ఇవ్వకపోవడమే కాకుండా యూరియా కొరకు వచ్చిన రైతులను సుమారుగా నాలుగు గంటల పైగా బయట నిలబెట్టడం వ్యవసాయ శాఖ అధికారులు రైతులను చులకనగా చూడటం ఒకటేనని డక్కిలి మండల రైతులు ఆవేదన




వ్యక్తం చేస్తున్నారు.

# స్వామి వివేకానంద యువతకు స్ఫూర్తి ప్రదాత


**- స్వామి వివేకానంద జయంతి సందర్భంగా డ్రగ్స్‌కు వ్యతిరేకంగా బుచ్చిరెడ్డి పాళెంలో 3కె రన్**
**- "సే నో టు గాంజ" నినాదంతో తలపెట్టిన 3కె రన్ దారి తప్పిన యువతకు సందేశం**
**- యువత సన్మార్గంలో నడవాలి, స్నేహితుల్లో ఎవరైనా దారి తప్పి ఉంటే వారిని సంస్కరించాల్సిన బాధ్యత కూడా యువతపై ఉంది - నెల్లూరు జిల్లా పోలీసు అసాంఘిక శక్తుల పాలిట సింహ స్వప్నంగా పనిచేస్తుంది - కష్టపడి చదవండి, తల్లితండ్రుల ఆశలు వమ్ము చేయకండి - 3కె ప్రారంభోత్సవం సందర్భంగా ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి**





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** యువత సన్మార్గంలో నడవాలని స్నేహితుల్లో ఎవరైనా దారి తప్పి వుంటే వారిని సంస్కరించాల్సిన బాధ్యత కూడా యువతపై ఉందన్నారు కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి. స్వామి వివేకానంద జయంతి సందర్భంగా డ్రగ్స్ కు వ్యతిరేకంగా బుచ్చిరెడ్డి పాళెం డివిఎన్ఆర్ హైసూల్ వద్ద నుంచి ప్రారంభమైన 3కె రన్‌ను ఆమె పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ "సే నో టు గాంజ" నినాదంతో తలపెట్టిన 3కె రన్ దారి తప్పిన యువతకు సందేశంలాంటిదన్నారు. యువశక్తిని సరైన దిశలో మళ్ళించడానికి బుచ్చిరెడ్డి పాళెం యువత చేసిన కృషిని ఆమె అభినందించారు. చదువొక్కటే కాకుండా క్రీడలు, 3కె రన్ సందేశాత్మక కార్యక్రమాలు చేయాలని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి సూచించారు. కష్టపడి చదివి కన్న వాళ్ళ ఆశలు, ఆకాంక్షలు నెరవేర్చాలని ఆమె యువతకు హితవు పలికారు. మత్తు పదార్ధాల సేవనానికి వ్యతిరేకంగా యువత తలపెట్టిన అవగాహన కార్యక్రమం ఒక్క రోజుతో ముగిసి పోకూడదని నిరంతర కొనసాగాలని ఆమె సూచించారు. నెల్లూరు జిల్లా పోలీసు అసాంఘిక శక్తుల పాలిట సింహ స్వప్నంగా పనిచేస్తుందని కొనియాడారు. నేరాల నియంత్రణలో యువత కూడా భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి పేర్కొన్నారు. చెడు స్నేహాలకు దూరంగా ఉండాలని ఆమె యువతకు పిలుపునిచ్చారు. చెడు వ్యసనాల బారిన పడి దారి తప్పుతున్న యువతను సంస్కరించే బాధ్యత యువతపైనే ఉందని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి యువతకు దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో బుచ్చి మున్సిపల్ ఛైర్ పర్సన్ మోర్ల సుప్రజ, వవ్వేరు కోఆపరేటివ్ బ్యాంక్ ఛైర్ పర్సన్ దొడ్ల విజయలక్ష్మి, టిడిపి సీనియర్ నాయకులు కోడూరు కమలాకర్ రెడ్డి, దువ్వూరు కళ్యాణ్ రెడ్డి, బెజవాడ వంశీకృష్ణా రెడ్డి, మండల రూరల్, టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు ఎంవి శేషయ్య, అర్బన్ టిడిపి అధ్యక్షులు బెజవాడ జగదీష్, గుత్తా శ్రీనివాసరావు, జొన్నవాడ ఆలయ మాజీ ఛైర్మెన్ పుట్టా సుబ్రహ్మణ్యం నాయుడు చేనేత సంఘ నాయకులు కెవి శేషయ్య బుచ్చి పట్టణ వైస్ ఛైర్మెన్లు, కౌన్సిలర్లు మరియు కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

# కాకాణి పూజితమ్మ చేతుల మీదుగా దుస్తుల పంపిణీ

**నెల్లూరు, (రాజధాని వార్తలు):** సంక్రాంతి పండుగ సందర్భంగా ఆనవాయితీ ప్రకారం ప్రతిఏటా తమ స్వస్థలం తోడేరు గ్రామంలో ప్రజలందరికీ నూతన వస్త్రాలు అందించడంలో భాగంగా రత్నగిరి, శాంతినగర్, తోడేరు ఎస్సీ కాలనీ, వీవర్స్ కాలనీ లోని కుటుంబాలకు చీరలు, పంచలు, లుంగీలు పంపిణీ. దుస్తుల పంపిణీకి విచ్చేసిన పూజితమ్మకు ఆదరాభిమానాలతో ఘన స్వాగతం పలికిన తోడేరు గ్రామస్తులు. తోడేరు గ్రామ ప్రజల సహకారం ఎప్పటికీ మర్చిపోలేమని ఊహ తెలిసినప్పటినుండి కుటుంబ సభ్యులలాంటి గ్రామస్తుల మధ్య సంక్రాంతి పండుగ జరుపుకుంటామని తాత కాకాణి రమణారెడ్డి, తండ్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి స్ఫూర్తితో గ్రామస్తులకు సంపూర్ణ సహాయ సహకారాలు అందిస్తామని తెలియజేస్తూ గ్రామస్తులందరికీ పేరుపేరునా సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేసిన కాకాణి పూజితమ్మ.



# దివ్యాంగులకు సేవ చేయడం తనకెంతో అదృష్టం



**చిల్లకూరు, (రాజధాని వార్తలు):** దివ్యాంగులకు సేవ చేయడం తనకెంతో అదృష్టంగా భావిస్తున్నాను అని రాజినేని రామానాయుడు చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు శ్రీనివాసులు నాయుడు తెలిపారు. సోమవారం చిల్లకూరు మండలం చేడిమాల గ్రామంలోని శ్రీ భవాని సమేత నాగలింగేశ్వర స్వామి దేవస్థాన ప్రాంగణంలో రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధినేత రాజనేని శ్రీనివాసులు నాయుడు దాతృత్వంతో చిల్లకూరు, కోట, చిట్టమూరు మండలాల్లోని దివ్యాంగులకు 1 లక్ష 30 వేల రూపాయలు విలువచేసే పది ట్రైసైకిళ్లు, రెండు వీల్ చైర్లు, ఒక స్టిక్‌ను ఆయన చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు నాయుడు మాట్లాడుతూ మా ట్రస్ట్ తరపున దివ్యాంగులకు సేవ చేసుకునే భాగ్యం కలగడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ఎవరికి ఏ ఆపద వచ్చినా మా ట్రస్టును సంప్రదించవచ్చునని, ముఖ్యంగా విద్య, వైద్యం అందించడంలో మా ట్రస్ట్ ఎప్పుడు ముందుంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు కో ఫౌండర్ రాజనేని శిరీషమ్మ, అధ్యక్షులు పిచ్చయ్య నాయుడు, వెంకటేశ్వర్లు నాయుడు, ట్రస్ట్ సభ్యులు బాబు, ప్రజెంద్రారెడ్డి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# రంగోలి పోటీలలో విజేతలు వీరే

**విజయనగరం, (రాజధాని వార్తలు):** ప్రముఖ ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రం రామనారాయణం శ్రీమద్రామాయణ ప్రాంగణంలో రంగోలి పోటీలు ఘనంగా నిర్వహించారు. పోటీలకు మహిళల నుంచి అపూర్వ స్పందన లభించింది. మొదటి బహుమతిని అయినాడ గ్రామానికి చెందిన వెంకటలక్ష్మి,ద్వితీయ బహుమతిని జరజాపు పేట గ్రామానికి చెందిన టి.దివ్య గెలుచుకోగా ,తృతీయ బహుమతిని గాజుల రేగకు చెందిన శ్రావణి, దాసన్నపేటకు చెందిన అరుణ సంయుక్తంగా కైవసం చేసుకున్నారు. విజేతలకు ఎన్ సి ఎస్ ట్రస్ట్ సభ్యులు నారాయణం పద్మశ్రీ సీతారామయ్య



బహుమతి ప్రదానం గావించారు.

# రేపటి విజయం కోసం కలిసి నడుద్దాం - కాకాణి






**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు నగరంలోని డిఆర్ ఉత్తమ్ హొటల్ నందు మాజీ మంత్రివర్యులు మరియు జిల్లా పార్టీ అధ్యక్షులు కాకాణి గోవర్ధన్ రెడ్డి అధ్యక్షతన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం..హాజరైన రీజినల్ కో ఆర్డినేటర్ ఎంపీ మిధున రెడ్డి, ఎంపీ గురుమూర్తి, రాజ్యసభ సభ్యులు మరియు తిరుపతి పార్లమెంట్ పరిశీలకులు మేడా రఘునాథరెడ్డి, నెల్లూరు పార్లమెంట్ పరిశీలకులు జంకె వెంకటరెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్తలు, ముఖ్య నాయకులు... వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణానికి పటిష్టమైన చర్యలు. ప్రతిపక్షంలో ఉన్నా సరే ప్రాణాలకు తెగించి మా క్యాడర్ పోరాడుతుంది.. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు మాట్లాడటానికి కూడా టీడీపీ భయపడేది.. కానీ ఇప్పుడు మా క్యాడర్ రోడ్డెక్కి పోరాటాలు చేస్తుంది.. జగన్ కోసం ప్రాణాలు ఇచ్చేందుకు క్యాడర్‌తో పాటు మేము కూడా సిద్ధంగా ఉన్నాం..వైసీపీ క్యాడర్‌ను చూసి తెలుగుదేశం పార్టీ భయపడుతుంది.. సోషల్ మీడియాలో పోస్టులు పెట్టినా కూడా.. పోలీసుల చేత అక్రమ కేసులు పెట్టిస్తోంది.. కూటమి ప్రభుత్వాన్ని సాగనంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు.. ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందనే విషయం చంద్రబాబుకి ఇప్పటికే అర్థమైంది..ప్రభుత్వంపై ఎంత వ్యతిరేకత ఉందో.. ఇటీవల నిర్వహించిన కోటి సంతకాల సేకరణతో తేటతెల్లమైంది... ఉమ్మడి నెల్లూరు జిల్లాతో పాటు కందుకూరు నియోజకవర్గంతో కలిపి వచ్చే ఎన్నికల్లో 11 అసెంబ్లీ నియోజకవర్గాలలో ఘన విజయం సాధించడంతో పాటు నెల్లూరు, తిరుపతి పార్లమెంట్ స్థానాల్లో వైసీపీ జెండా ఎగరడం ఖాయం. గ్రామస్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నాం.. కూటమి ప్రభుత్వాన్ని సాగనంపేందుకు 2027లో జమిలి ఎన్నికలు




వస్తాయన్న ఆతృతలో ప్రజలు ఉన్నారు.. జెమిలి ఎన్నికలు వస్తే వైసీపీ అధికారంలోకి రావడం ఖాయం..నెల్లూరు జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులన్ని రాజశేఖర్ రెడ్డి, జగన్మోహన్ రెడ్డి చలవే.. చంద్రబాబు హయాంలో ప్రాజెక్టులకు పైసా నిధులు కూడా కేటాయించలేదు..ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన వెంటనే మరిచిపోవడం చంద్రబాబుకు అలవాటు.. జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలో ప్రతి విషయంలో ప్రజల పక్షన నిలబడి పోరాడుతాం.

# సంక్షేమం, అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యం

**- పి4 స్ఫూర్తితో సంపన్నులు అభివృద్ధిలో భాగస్వాములు అవుతున్నారు - 1 కోటి 37 లక్షలతో మిక్కిలింపేట పేటలో అభివృద్ధి పనులకు శ్రీకారం - గత ఐదేళ్లలో విధ్వంసం తప్ప అభివృద్ధి లేదు - ప్రజలకు సేవ చేయడం కోసం నేను విపిఆర్ రాజకీయాలలోకి వచ్చాం - ఇఫ్కో కిసాన్ సెజ్‌లో పరిశ్రమల స్థాపన ద్వారా యువతకు వేలాదిగా ఉద్యోగ అవకాశాలు : ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి**






**నెల్లూరు, (రాజధాని వార్తలు):** చంద్రబాబు నాయుడు పాలనలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అభివృద్ధి సంక్షమాలకు కేర్ ఆఫ్ అడ్రస్‌గా మారిందన్నారు. 1 కోటి 37 లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనుల శంఖుస్థాపన మరియు ప్రారంభోత్సవ కార్యక్రమాలలో పాల్గొనేందుకు కొడవలూరు మండలం మిక్కిలింపేట పేట గ్రామానికి విచ్చేసిన కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి గారికి స్థానిక నాయకులు మరియు ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా 90 లక్షలతో మిక్కిలింపేట నుంచి బుచ్చి – రాజుపాళెం ప్రధాన రహదారికి అనుసంధానం చేసే లింక్ రోడ్డు, 36 లక్షలతో నిర్మించనున్న విలేజ్ హెల్త్ సెంటర్ నిర్మాణ పనులకు శంఖుస్థాపన చేశారు. మిక్కిలింపేట పేట గ్రామంలో 11 లక్షలతో నిర్మించిన సిసి రోడ్ల ప్రారంభోత్సవం చేసారు. అనంతరం ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ గత ఐదేళ్లలో విధ్వంసం తప్ప అభివృద్ధి జాడే లేదని కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన 20 నెలల్లో చేసిన అభివృద్ధి మరియు సంక్షమ కార్యక్రామాల గురించి వివరించారు. గత 20 నెలల్లో కొడవలూరు మండల వ్యాప్తంగా 10 కోట్ల 30 లక్షల అభివృద్ధి పనులు జరిగితే ఒక్క మిక్కిలింపేట పేట పంచాయతీలోనే 1 కోటి 37 లక్షల రూపాయలు కేటాయించిన విషయాన్ని ప్రజల దృష్టికి తెచ్చారు. గత ప్రభుత్వం ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ తెచ్చి రైతాంగాన్ని భయ భ్రాంతులకు గురి చేస్తే చంద్రబాబు నాయుడు పాలనలో మీ భూమి – మీ హక్కు అంటూ రైతుల భూములకు భద్రత కల్పిస్తూ పట్టాదార్ పాస్ పుస్తకాలు అందచేసిన విషయాన్ని గుర్తు చేసారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పి4 స్ఫూర్తితో సంపన్నులు అభివృద్ధిలో భాగస్వాములు అయ్యేందుకు ముందుకు రావడం హర్షణీయమన్నారు. మిక్కిలింపేట గ్రామంలో 36 లక్షలతో నిర్మించనున్న విలేజ్ హెల్త్ సెంటర్‌కు స్థలదానం చేసిన దేవేళ్ళ విష్ణువర్ధన్ రెడ్డిని ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి అభినందించారు. 30 వేల రూపాయలు వెచ్చించి మిక్కిలింపేట గ్రామంలో వీధి లైట్లు వేయించిన దేవేళ్ళ విష్ణువర్ధన్ రెడ్డి దాతృత్వాన్ని ఆమె కొనియాడారు. సమాజ సేవలో ఉన్నంత తృప్తి మరెందులోను ఉండదని విపిఆర్ ఫౌండేషన్ ద్వారా తాము చేసే సమాజహిత కార్యక్రమాల ద్వారా పొందే అనుభూతిని ఈ సందర్భంగా ఆమె వ్యక్తం చేశారు. తాను మరియు ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ప్రజాసేవ చేయాలన్న సంకల్పంతోనే రాజకీయాలలోకి వచ్చామన్నారు. చంద్రబాబు పాలనా దక్షతపై నమ్మకంతో రాష్ట్రంలో పరిశ్రమలు పెట్టేందుకు పారిశ్రామిక వేత్తలు ముందుకొస్తున్నారని ఇఫ్కో కిసాన్ సెజ్ పెద్ద పారిశ్రామిక వాడగా మారబోతుందని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. ఇఫ్కో కిసాన్ సెజ్ లో ఇప్పటికే 2 ఇథనాల్ ఫ్యాక్టరీలు పెట్టేందుకు సన్నాహాలు జరుగుతుండగా 6 వేల 675 కోట్లతో 10 గిగావాట్ల సామర్థ్యం గల పవర్ ప్లాంట్ ఏర్పాటుకు టాటా గ్రూప్ ముందుకు రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. రానున్న రెండేళ్లలో నియోజకవర్గ పరిధిలోని నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు వస్తాయని ఆమె పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన 20 నెలల్లో ఎన్నికలకు ముందు చేసిన ప్రతి హామి అమలు చేస్తున్నామన్నారు.

అనుభవం ఉన్న నాయకుడు, ప్రజల పక్షన నిలిచే ప్రభుత్వం ఉంటే అభివృద్ధి, సంక్షమం ఎలా చేసుకోవచ్చో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆచరణలో చేసి చూపెడు తున్నారున్నారు. ఈ తహసీల్దారు స్ఫూర్తి రెడ్డి, ఎంపీడీఓ సుబ్బా రావు, సర్పంచ్ కోడూరు బుజ్జిరెడ్డి, మండల టిడిపి అధ్యక్షులు నాపా వెంకటేశ్వర్లు నాయుడు, టిడిపి జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ భూలోక విజయకుమార్, ఎంపీటీసీ గరికపాటి రాజేంద్ర, స్థానిక నాయకులు వేణుగోపాలరెడ్డి, సుధాకర్ రెడ్డి, నవీన్ రెడ్డి, కేతు వెంకటరమణా రెడ్డి, చక్కా మదన్ తదితరులు పాల్గొన్నారు.

# రేవంత్‌పై వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నా : తలసాని



**హైదరాబాద్, (రాజధాని వార్తలు):** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఉద్దేశించి మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారాయి. దీనిపై తలసాని స్పందిస్తూ.. సీఎం రేవంత్ రెడ్డిపై తాను చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ.. 'సికింద్రాబాద్‌ను ముక్కలు ముక్కలుగా చేస్తే ముక్కలుగా చేస్తా' అనే మాటల్లో ఆవేశం తప్ప వేరే ఉద్దేశం లేదని స్పష్టం చేశారు. రాజ్యాంగబద్ధ పదవుల్లో ఉన్న వారంటే తనకు గౌరవం ఉందని ఆయన తెలిపారు. తమ ప్రాంతాన్ని కాపాడుకోవడం తప్ప వేరే ఉద్దేశం లేదని పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ తెలుసుకోవాలని సూచించారు.

**కుట్రలు చేస్తే ఊరుకోం...**

సికింద్రాబాద్‌ను ముట్టుకోవడం లేదని సీఎం రేవంత్ రెడ్డి చెబుతున్నారని.. కానీ సికింద్రాబాద్‌లోని పలు పోలీస్ స్టేషన్లు మల్కాజిగిరి జోన్లో కలిపింది వాస్తవం కాదా? అని ప్రశ్నించారు తలసాని. అలాగే సికింద్రాబాద్ పరిధిలోని పలు డివిజన్‌లను మల్కాజిగిరి జోన్ పరిధిలోని బోయిన్ పల్లి సర్కిల్‌లో చేర్చారని ఆరోపించారు. సికింద్రాబాద్ జీహెచ్ఎంసీలోనే ఉందంటూ సీఎం రేవంత్ రెడ్డి చేసిన తప్పుడు ప్రకటన ప్రజలను మభ్యపెట్టడానికే అంటూ విమర్శించారు. 220 ఏళ్ల చరిత్ర గల సికింద్రాబాద్ ఇమేజ్‌ను దెబ్బతీసే కుట్రలు చేస్తే ఊరుకోమని హెచ్చరించారు. సికింద్రాబాద్ అస్తిత్వాన్ని కాపాడుకోవడం కోసం పోరాటం చేస్తున్నామని వివరించారు. సికింద్రాబాద్‌ను ప్రత్యేక కార్పొరేషన్‌గా ప్రకటించి తీరాల్సిందేనని మాజీ మంత్రి డిమాండ్ చేశారు.

**శాంతి ర్యాలీ..**

ఈ అంశంపై నిరసనగా ఈ నెల 17న భారీ శాంతి ర్యాలీ నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఈ ర్యాలీ సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి ప్రారంభమై క్లాక్ టవర్, ప్యాట్నీ, ప్యారడైజ్ మీదుగా ఎంజీ రోడ్‌లోని గాంధీ విగ్రహం వరకు సాగుతుందని వెల్లడించారు. ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి సికింద్రాబాద్ ప్రత్యేక కార్పొరేషన్ ప్రకటన సాధించేందుకు ఈ ర్యాలీ నిర్వహించనున్నట్లు తలసాని శ్రీనివాస్ యాదవ్ స్పష్టం చేశారు.

# ప్రజలకు అందుబాటులో మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధు రెడ్డి..!



**శ్రీకాళహస్తి, (రాజధాని వార్తలు):** శ్రీకాళహస్తి మునిసిపల్ పరిధిలో మరో రెండు, మూడు నెలల్లో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఒకటైన మున్సిపల్ ఎన్నికల్లో అధికార కూటమిపై పై చేయి సాధించడానికి వైఎస్ఆర్సిపి నియోజకవర్గం బాధ్యులు, మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి వార్డుల పర్యటనకు గుడ్ మార్నింగ్ శ్రీకాళహస్తి పేరుతో మరోసారి శ్రీకారం చుట్టనున్నట్టు విశ్వసనీయవర్గాల సమాచారం. గత వైసిపి పాలనలో కేతిరెడ్డి తర్వాత మాజీ ఎమ్మెల్యే శ్రీకాళహస్తిలో కార్యక్రమాన్ని చేపట్టిన విషయం తెలిసిందే. ఈ కార్యక్రమంలో ఇప్పటికే అలకపాన్పు ఎక్కిన వైసీపీ నేతలను నేరుగా కలిసి అటు వైఎస్ఆర్సిపి నాయకులు, ఇటు కార్యకర్తల్లో ఫుల్ జోష్ నింపేందుకు ప్రాణాళిక రచించినట్లు విశ్వసిన్వర్గాల సమాచారం. ఇప్పటికే గత రెండు నెలలుగా పలువురు నూతన వధూవరులను ఆశీర్వదించడం, వైఎస్ఆర్సిపి నాయకుకు, కార్యకర్తలను నేరుగా పరామర్శించడం, విద్యుత్ పోరు నుండి మెడికల్ కాలేజల కోటి సంతకాల సేకరణ వరకు వైఎస్ ఆర్సిపి నాయకులకు మాజీ ఎమ్మెల్యే అందుబాటులో ఉండడం, గుడ్ మార్నింగ్ శ్రీకాళహస్తికి శ్రీకారం చుట్టడం అందుకు నిదర్శనం అని చెప్పడానికి చక్కని నిదర్శనం. అధికార కూటమి నేతల్లో ఉన్న కంటికి కనిపించని అసంతృప్తిని మున్సిపల్ ఎన్నికల్లో వైఎస్ఆర్సిపి సత్తా చాటేందుకు మాజీ ఎమ్మెల్యే మరోసారి గుడ్ మార్నింగ్ శ్రీకాళహస్తితో 2029 ఎన్నికల్లో వైఎస్ఆర్సిపి మున్సిపల్ పీఠంను కైవసం చేసుకోవడానికి కసరత్తు ప్రారంభించారని సమాచారం. సంక్రాంతి తర్వాత ఈ గుడ్ మార్నింగ్ శ్రీకాళహస్తిని మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి ప్రారంభిస్తారని సమాచారం. మరి చూడాలి పుర ప్రజల స్పందన.

# RAJADHANI CLASSIFIEDS Ad. Call
9440662699, rajadhanivartalu.com

## EDUCATIONAL

- కల్లం ఇంజనీరింగ్ కాలేజీ, గుంటూరు, 0863-2119726
- యస్ ఆర్ ఐ అకాడమీ అఫ్ సైన్సెస్ అండ్ హాస్పిటల్, మంగళగిరి 08645-230101
- ఎయిమ్స్ హాస్పిటల్, మంగళగిరి 9493065718
- యస్ ఆర్ యమ్ యూనివర్సిటీ, ఏపీ నీరుకొండ, 0863-2429299
- విట్ యూనివర్సిటీ, ఏపీ, ఐనవోలు, 0863-2370444
- IVY Overseas, Vijayawada 73375 55680
- VIVA School, Nambur 0866 668 8999
- , అరవింద స్కూల్ వేర్ ఈచ్ చైల్డ్ ఈజ్ స్పెషల్, మంగళగిరి 08645-246878
- Eurekha Child, An AID India Initiative, Chennai 89398 20480
- Adarsha Educational Society Visakhapatnam, 0891-287 4605
- SPRITS Colleges, Kadapa, 9848664650
- Centuriaon University Rollavaka, AP 9840015963

## HOSPITALS

- అష్రఫ్ మెటర్నిటీఇ అండ్ టి మల్టీ స్పెషాలిటీ హాస్పటల్, విజయవాడ డా.యం.ఎ. రెహమాన్, 0866-2475087
- చింతలూరు ఆయుర్వేదం డాక్టర్ డి.విశ్వనాథ్, 9032990138
- హాసిని మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ మండడం, డా. రహీమ్ బాషా 87902 27564
- శాస్త్రి బామ్ ఆయుర్, మంగళగిరి, 7999959999
- Manipal Hospitals, Vijayawada, 0866-2469700
- Sri Sivanath Ayurvedic Clinic Vijayawada, 09440 162256
- Rushad Opticals,Mangalagiri 99667 87654

## MATRIMONIAL

- కావ్యశ్రీ మ్యారేజ్ లింక్స్: 1వ, 2వ,లేట్ మ్యారేజెస్, తోడు,సంబధాలు, డైవోర్సీస్, విడోస్, డోయర్స్,పెన్షనర్లకు,అన్ని కులాల వారికీ పోస్ట్ సెటిల్మెంట్లు(స్త్రీలకు ఫ్రీ రిజిస్ట్రేషన్) ఫోన్: 9100669324
- జానీ మ్యారేజ్ లింక్స్, విజయవాడ 985394613
- Post your Alliances ad on Rajadhani Vartalu NewsPaper
- Post your Alliances ad on rajadhanivartalu.com

## REAL ESTATE

- New Sneha Builders & Developers, Kurnool, AP 9440662699
- గాలిసా రియల్ ఎస్టేట్, అమరావతి 9440662699
- Apartments for Sale, Attractive Price,Crystal Constructions, Gated Community, NRI Hospital Road, Srinivasam Apartments, Mangalagiri, 9440662699
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ సంఘం, 0866-2452129
- ప్రైమ్ లివింగ్ రియల్ ఎస్టేట్ మంగళగిరి, 994860855

## NGO's

- శ్రీ శారదా పీఠం, విశాఖపట్నం 0891-2763332
- జ్ఞానానందం, ఐనవోలు చర్చ్ 8790878542
- ఇమ్మానుయేల్ చర్చ్, ఐనవోలు 9866777439
- Christian Rights Protection Service of India, Vijayawada 79897 88645
- రామయ్య చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ టి.రమేష్, మంగళగిరి 0863-999999

## RESTAURENTS

- New Continental Park Hotel Vijayawada, 0866-6679999
- అయ్యూబ్ బిర్యానీ హౌస్, ఇబ్రహీంపట్నం 9502727306
- Hotel Ilapuram, Vijayawada 0866-2575251
- Lemontree Premier, Vijayawada, 0866-6919999
- Bismilla Biryani Point Tadepalli, 6300096288
- Khaleel Bhai Family, Restaurent, Guntur 855087555
- Novotel,Vijayawada 0866-6688999
- నాని స్వీట్స్, మంగళగిరి 8374220220, 9989229799
- Lakshmi Mourya Malkapuram, 9052631122
- Seweet Magic, Mangalagiri 9059323334
- Hello Idly, Mangalagiri 95424 93333
- Chill Out Restaurent Undavalli, 8179549922
- Hotel Park Residency Vijayawada-81216 69996

## COMPANIES

- ఈ-కామర్స్ కన్సల్టింగ్ నవీన్, 9008640610
- Insurence needs for NRI's Call 6305479394
- Hareesh Video Shooting 9666643567
- S RICE Traders Vijayawada 9849741984
- రవికాంత్, ఐటీ కన్సల్టింగ్ 9908188454
- ఎఫ్టానిక్స్ స్మార్ట్ సొల్యూషన్స్, మంగళగిరి 0866-2466675
- ఐవిస్ ఇ-సర్వీలియన్సు కంపెనీ మంగళగిరి, 040-40038590
- నవీన్ ఈకామర్స్ కన్సల్టింగ్ 9008640610
- యూ యస్ ఎ స్మార్ట్ డీల్స్ గ్లోవ్స్ మాస్క్స్ 001-2489965595
- సిహెచ్.చంద్రశేఖర రెడ్డి, ది నూతక్కి పాథమికవ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్, 08645-275239
- ఇన్కమ్ టాక్స్ ప్రాక్టీషనర్లు మంగళగిరి, 789998999
- Visakha Healthcare 92466 46561
- Vivanta, Vijayawada 0866 664 4444
- Minerva Grand 0866 667 8888
- Rain Tree Park, Nambur, ijmprop.com
- Echo Friendly Bags, Hyderabad-92461 69069
- ఏపీ యస్ యస్ డి సి హెల్ప్ లైన్ తాడేపల్లి, 8004252422
- Sri Venkateswara panbrokers, Guntur 0863-2228628
- మధు గ్రాఫిక్స్ డిజైనర్, హైదరాబాద్ 6303728907
- AICA Events, 9133133688
- శ్రీ దుర్గా డిజైనర్స్ లేడీస్ టైలర్స్ మంగళగిరి, 9959308664
- Madeena Trading Company Vijayawada, 9000628426
- పొట్లాబత్తుని శ్రీకాంత్ లక్ష్మీ సారీస్, మంగళగిరి 08645-234002
- డిజిటల్ ఎక్సపోనెంట్స్, కిషోర్ digitalexponents.in 7793903754
- చైతన్య జి.జి బ్యాంక్, రాయపూడి గుంటూరు జిల్లా, 08645-244266
- ఏపీ యస్ ఆర్ టి హెల్ప్ లైన్ తాడేపల్లి, 0863-2340678
- జవహర్ ఆటోనగర్ ఆటోమొబైల్ టెక్నికల్ అసోసియేషన్ 9394139239, 8143444459
- Capital Way Residency, Tadepalli, 9493523232
- Lemon Tree Hotel, Vijayawada, 866 691 9999
- For Classifieds ad, Call 9440662699
- Rajadhani Real Estate Plots,Amaravati, AP Buy / Sell 9440662699

RAJADHANIVARTALU.COM
9440662699


# భూమి ఆరోగ్యానికి సాయంగా సేంద్రియ వ్యవసాయం



**తిరుపతి, (రాజధాని వార్తలు):** భూమి ఆరోగ్యానికి సాయంగా సేంద్రియ వ్యవసాయం తోడ్పడుతుందని తిరుపతి జిల్లా వనరుల వ్యవ సాయ అధికారి వేణుగోపాల్ తెలిపారు. సోమవారం మండల కేంద్రమైన చిల్లకూరులో జిల్లా వనరుల కేంద్రం తిరుపతి వారి ఆధ్వర్యంలో రైతులకు సేంద్రీయ వ్యవసాయంపై శిక్షణా కార్య క్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా వనరల కేంద్ర వ్యవసాయ అధికారి వేణుగోపాల్ మాట్లాడుతూ సేంద్రియ వ్యవసాయం భూమి ఆరోగ్యమును మెరుగుపరిచి నాణ్యమైన దిగుబడిని అందిస్తుందని తద్వారా ఆహార భద్రతను ఆరోగ్య భద్రతను భావితరాలకు అందించిన వచ్చని తెలియ జేశారు. ప్రస్తుతం రైతులు అధికంగా ఎరువులను పురుగు మందులను వాడడం వలన భూమి ఆరోగ్యం క్షణించిందని భూమి ఉత్పాదక శక్తిని కోల్పోయిందని, దీనిని మెరుగుపరు చుకోవడానికి సేంద్రీయ వ్యవసాయమే సరైన మార్గమని తెలియజేశారు. అధికంగా రసాయన ఎరువులు వాడకం భూమిని చౌడు చేస్తుందని, భూసార పరీక్ష ఆధారంగా ఎరువుల వాడకం చేపట్టాలని సేంద్రియ ఎరువును విరివిగా వాడుకోవాలని దానివలన భూమి ఆరోగ్యమే కాక మనకు ఆరోగ్య భద్రత కూడా లభిస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి రవిప్రసాద్ చిల్లకూరు మండల ఏపీసిఎన్ఎఫ్ ట్రైనర్ జైతున్ బి మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# లైవ్ ఫిష్ ట్రాన్స్‌పోర్ట్ వాహనం అందజేత



**కాకినాడ రూరల్, (రాజధాని వార్తలు):** ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం (పి ఎం ఎం ఎస్ వై) 2020-21 లో భాగంగా కరప మండలం కొంగోడు గ్రామానికి చెందిన చేపల వ్యాపారి నొక్కు శివప్రసాద్‌కు లైవ్ ఫిష్ ట్రాన్స్‌పోర్ట్ వాహనం, నాలుగు ఆక్సిజన్ సిలిండర్లు, నాలుగు వెయ్యి లీటర్ల వాటర్ డ్రమ్ములు మంగళవారం అధికారికంగా అందజేశారు. కాకినాడ రూరల్ నియోజక వర్గ ఎమ్మెల్యే పంతం వెంకటేశ్వరరావు (నానాజీ) గుడారగుంటలోని నివాసంలో ఈ పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యేతో పాటు శాసన మండలి సభ్యులు కర్రి పద్మశ్రీ, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. రూ. 16,40,000లు, లబ్ధిదారుని భారం (40%): రూ. 6,56,000లు, ప్రభుత్వ రాయితీ (60%): రూ. 9,84,000లు మొత్తం విలువైన ఉపకరణలు అంద జేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, మత్స్య శాఖ మరియు అభివృద్ధి శాఖ అధికారులు, కాకినాడ మత్స్యాభివృద్ధి అధికారి జీ.గోపి, వేట్లపాలెం మత్స్య శాఖ ఆర్.నూకరాజు, సహాయ తనిఖీ అధికారి కె. మధుబాబు, గ్రామ మత్స్య సహాయకులు ఎం.లావణ్య తదితరులు పాల్గొన్నారు.

# అప్పలరాజుపై పీడీ యాక్ట్ ఎత్తి వేయాలి



**శ్రీకాళహస్తి, (రాజధాని వార్తలు):** అనకాపల్లి జిల్లాలో బలవంతపు భూ సేకరణకు వ్యతిరేకంగా రైతులు, మత్స్యకారుల తరుపున పోరాడుతున్న రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎం.అప్పల రాజుపై పెట్టిన పిడి యాక్ట్‌ను వెంటనే ఎత్తివేయాలని సీపీఎం ఏరియా కార్యదర్శి గంధం మణి డిమాండ్ చేశారు. స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద అప్పలరాజును విడుదల చేయాలని సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. 1986లో వచ్చిన పిడి యాక్ట్‌ను, ఒక రాజకీయ నాయకుడి మీద, సామాజిక కార్యకర్తపై పెట్టటం అన్యాయమని అన్నారు. వెంటనే కూటమి ప్రభుత్వం అప్పలరాజుపై పెట్టిన పీడీ యాక్ట్‌ను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దాసరి జనార్ధన్, పెనగడం గురవయ్య, కుమార్, నాగరాజు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా అలయన్స్ క్లబ్ శరవణ స్వామి వివేకానంద జయంతి




**కాకినాడ, (రాజధాని వార్తలు):** అలయన్స్ క్లబ్ ఆఫ్ కాకినాడ శరవణ ఆధ్వర్యంలో జాతీయ యువజన దినోత్సవం, స్వామి వివేకానంద జయంతి కాకినాడలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రామకృష్ణరావుపేటలో క్లబ్ అధ్యక్షులు అలై. యాళ్ళ రత్నరావు మరియు క్లబ్ వ్యవస్థాపకులు అలై. దిలీప్ కుమార్ సధనాని స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షులు అలై. యాళ్ళ రత్నరావు మాట్లాడుతూ స్వామి వివేకా నంద ఆత్మ విశ్వాసం, క్రమశిక్షణ, సేవాభావంపై ఇచ్చిన సందేశాలు నేటి యువతకు మార్గదర్శకమని, సమాజం మరియు దేశ నిర్మాణంలో యువత కీలక పాత్ర పోషించాలని తెలిపారు. క్లబ్ వ్యవస్థాపకులు అలై. దిలీప్ కుమార్ సధనాని మాట్లాడుతూ జాతీయ యువజన దినోత్సవం యువతను నైతిక విలువలు, అంకితభావం, సామాజిక సేవ మార్గంలో నడిపించే బాధ్యతను గుర్తు చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ఉపాధ్యక్షులు అలై. యడవిల్లి మురళీధర్, సభ్యులు అలై. కె.శ్రీలక్ష్మ, మాజీ అధ్యక్షులు అలై. సేతు మాధవ రావు, క్లబ్ కోశాధికారి అలై. దామిశెట్టి శ్రీనివాస రావు పాల్గొన్నారు.

# రెవెన్యూ సిబ్బందికి యూనిఫారాలు పంపిణి



**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** సంక్రాంతి పండుగను పురస్కరించుకొని పెద్దాపురం రెవిన్యూ డివిజన్ పరిధిలోని విధులు నిర్వహిస్తున్న క్లాస్-4 ఉద్యోగులకు రెవిన్యూ డివిజనల్ అధికారి కె శ్రీ రమణి యూనిఫారాలను పంపిణీ చేశారు. సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో ఈ సందర్భంగా రెవిన్యూ డివిజనల్ అధికారి మాట్లాడుతూ ప్రభుత్వ సేవలలో కీలక పాత్ర పోషిస్తున్న క్లాస్-4 ఉద్యోగుల సేవలు అభినందనీయమన్నారు. పండుగ సందర్భంగా వారికి ఈ విధమైన ప్రోత్సాహక చర్యలు చేపట్టడం సిబ్బందిలో ఉత్సాహాన్ని కలిగిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan